ఫిబ్రవరిలో వస్తున్న భైరవకోన



సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందుతున్న ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరుపేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పకులు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నట్లు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో సందీప్ కిషన్ మంత్రదండం పట్టుకొని గంభీరంగా కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచింది. అతీంద్రియ శక్తులకు సంబంధించిన అంశాల చుట్టూ అల్లుకున్న కథ ఇదని మేకర్స్ తెలిపారు. వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: ఛోటా కె. ప్రసాద్.

దేవకీ నందన వాసుదేవ



'ఈ కథకి 'దేవకీ నందన వాసుదేవ' సరైన టైటిల్. ఈ కథకోసం రెండేళ్లు వర్క్ చేశాను. నాకంటే బాగా తీయగలడనే నమ్మకంతో అర్జున్‌కి ఈ కథ ఇచ్చాను. స్టార్ రైటర్ సాయిమాధవ్ బుర్రాగారి మాటలు ఈ సినిమాకు పెద్ద ఎస్సెట్. అద్భుతమైన సంభాషణలు అందించారాయన. భీమ్స్ మంచి పాటలు ఇచ్చారు. పాత్రలకు తగ్గట్టు ఆర్టిస్టులు సెట్ అయ్యారు. ఇంత మాస్ పాత్రను అశోక్ ఎలా చేస్తాడా అనుకున్నాను. రషస్ చూశాక షాక్ అయ్యాను. చాలా సర్‌ప్రైజ్ ఇచ్చాడు' అని ప్రశాంత్ వర్మ అన్నారు. ఆయన కథతో అశోక్ గల్లా కథానాయకుడిగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రానికి 'దేవకీ నందన వాసుదేవ' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. వారణాసి మానస కథానాయిక. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ చిత్రం టీజర్‌ని బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌వర్మ మాట్లాడారు. 'ప్రశాంత్‌వర్మ అద్భుతమైన కథ, సాయిమాధవ్‌గారి సంభాషణలు, అర్జున్ దర్శకత్వ ప్రతిభ ఇవన్నీ ఈ సినిమాను నెక్స్ లెవల్లో నిలబెట్టాయి. ఆ ప్రభావం రేపు థియేటర్లలో చూస్తారు.' అని అశోక్ గల్లా నమ్మకంగా చెప్పారు. బాలకృష్ణ రాజీ పడకుండా సినిమాను నిర్మిస్తున్నారని, సాయి మాధవ్ మాటలు, భీమ్స్ పాటలు అలరిస్తాయని దర్శకుడు చెప్పారు. కృష్ణగారి కుటుంబం నుంచి వచ్చిన అశోక్ తప్పకుండా సూపర్‌స్టార్ అవుతాడని సాయిమాధవ్ బుర్రా నమ్మకం వెలిబుచారు. ఇంకా చిత్రబృందం మాట్లాడారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/CIll4Mq లో చదవండి.

సంక్రాంతికి మరో సూపర్‌హిట్ ఖాయం



'తెలుగువారికి సంక్రాంతి అంటే సినిమా పండుగ. ప్రేక్షకులు గతంలో నా సంక్రాంతి సినిమాలను గొప్ప హిట్ చేశారు. ఇప్పుడు 'నా సామిరంగ' చిత్రాన్ని కూడా అదే రీతిలో ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఈ సారి పండుగకు కిష్టయ్య వస్తున్నాడు. 'నా సామిరంగ' అంటూ బాక్సాఫీసును కొట్టబోతున్నాడు' అని నాగార్జున అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'నా సామిరంగ' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. విజయ్ బిన్నీ దర్శకుడు. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'ఈ సంక్రాంతికి నాలుగు సినిమాలు వస్తున్నాయి. అన్నింటినీ ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నాను. నాన్నగారి ఆజ్ఞగా భావించి 'నా సామిరంగ' చిత్రం చేశాను. కీరవాణి అద్భుతమైన పాటలు ఇచ్చారు. మూడు నెలల్లో ఈ సినిమాను పూర్తి చేయడం ఒక రికార్డు' అని తెలిపారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'చిన్నతనం నుంచి నేను నాగార్జున గారికి అభిమానిని. ఈలలు వేస్తూ థియేటర్లలో ఆయన సినిమాలు చూశాను. కీరవాణి, చంద్రబోస్ గారు మా టీంకు అండగా నిలిచారు' అని తెలిపారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'నాగార్జున గారితో కలసి నటించడం మరచిపోలేని అనుభవం. అక్కినేని అభిమానులందరూ ఈ సారి థియేటర్లలో పండుగ చేసుకోవడం ఖాయం' అన్నారు. విజయ్ బిన్నీ మాట్లాడుతూ 'చాలా తక్కువ టైంలో మంచి క్వాలిటీతో సినిమాను పూర్తి చేశాం. నా సాంగ్స్ చూసి దర్శకుడిగా అవకాశం ఇచ్చిన నాగార్జున గారికి రుణపడి ఉంటాను. యూనిట్‌లో ప్రతి ఒక్కరి సహకారంతో సినిమాను అనుకున్న విధంగా తెరకెక్కించగలిగాను' అన్నారు. కీరవాణి మాట్లాడుతూ 'కొత్త ప్రతిభను గుర్తించి అవకాశాలు ఇవ్వడంలో నాగార్జున ముందుంటారు. 'నా సామిరంగ'తో విజయ్ దర్శకుడిగా హిట్ అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి నాగార్జున గారు నన్ను ఆహ్వానించడమే గొప్ప గౌరవం అని చంద్రబోస్ తెలిపారు. నాగార్జున గారి లాంటి స్టార్‌తో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను అని ఆశికా రంగనాథ్ చెప్పారు.

అంజమ్మ అందరికీ నచ్చుతుంది



'హీరోయిన్ అనిపించుకోవడం కంటే మంచి నటి అనిపించుకోవడమే నాకిష్టం. హీరోయిన్ అని ట్యాగ్ తగిలిస్తే ఆనందపడిపోయే టైప్ కాదు నేను' అంటూ చెప్పుకొచ్చారు వరలక్ష్మి శరత్‌కుమార్. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హను-మాన్'. కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా అందులో కీలకపాత్ర పోషించిన వరలక్ష్మి శరత్‌కుమార్ విలేకరులతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

- ప్రశాంత్‌వర్మ ఈ కథ చెప్పినప్పుడు కచ్చితంగా చేయాల్సిన కథ అనిపించింది. ఈ సినిమాలో నా పాత్రపేరు అంజమ్మ. నేనూ, తేజా అక్కాతమ్ముళ్లం. మాపై తీసిన సరదా సన్నివేశాలు చక్కటి వినోదాన్ని పంచుతాయి. ఇది సూపర్‌హీరో కాన్సెప్ట్‌లో తెరకెక్కిన సినిమా. నేను కూడా ఒక యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఒక మాస్ హీరోకి ఉన్నంత ఎలివేషన్ వుండే యాక్షన్ సీక్వెన్స్ అది. ప్రశాంత్‌వర్మ ఎంత అద్భుతంగా ఈ కథ చెప్పాడో, అంత అద్భుతంగా తీశాడు. చిన్న సినిమాగా మొదలైన ఈసినిమా.. ఇంతింతై, వటుడింతై అన్నట్టు ఇంత పెద్ద స్కేల్‌లో గ్రాండ్‌గా రావడం చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకుల్లో కూడా పాజిటివ్ బజ్ ఉంది.
- నిర్మాత నిరంజన్‌రెడ్డికి హ్యాట్సాఫ్ చెప్పాలి. 'హను-మాన్' అద్భుతంగా నిర్మించారు. దర్శకుడి విజన్‌ని అర్థం చేసుకునే నిర్మాత దొరకడం టీమ్ అదృష్టం. సినిమా ఒప్పుకున్న రోజున చిన్న సినిమా అనుకున్నాను. తొలిరోజు సెట్‌లోకి అడుగుపెట్టగానే ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్స్ కనిపించాయి. అప్పుడర్థమైంది ఇది చిన్న సినిమా కాదు అని. ఏ విషయంలోనూ నిర్మాత రాజీ పడలేదు.

దిక్సూచి
DIKSUCHI



భారత రాజ్యాంగం - ముఖ్య చట్టాలు

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

పిట్ ఇండియా చట్టం-1784: ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను రెండు రకాలుగా విభజించారు.

1) బోర్డ్ ఆఫ్ కంట్రోల్: పరిపాలనా వ్యవహారాలను పరివేక్షిస్తుంది. దీనిలో ఆరుగురు సభ్యులు ఉంటారు.

2) కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్: వీరు వ్యాపార, వాణిజ్య అవసరాలను నియంత్రిస్తారు.

బోర్డ్ ఆఫ్ కంట్రోల్, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యవస్థల ఏర్పాటు దేశంలో పార్లమెంటేతర నియంత్రణనే కాక ద్వంద్వ పాలనకు కూడా పునాది వేసింది.

1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా గవర్నర్ జనరల్‌కు సలహా ఇవ్వడానికి కౌన్సిల్ ఆఫ్ ఫోర్ అనే నలుగురు సభ్యుల కార్యనిర్వాహక మండలి ఉండేది. పిట్స్ ఇండియా చట్టం ద్వారా సభ్యులను ముగ్గురికి తగ్గించారు. ఈ చట్టం ద్వారానే దేశంలో బ్రిటిష్ పాలిత ప్రాంతాలు అనే పదం బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. పిట్స్ ఇండియా చట్టం అనంతరం 1793, 1813, 1833, 1853 చార్టర్ చట్టాలు చేశారు.

చార్టర్ చట్టం-1793: 1773 రెగ్యులేటింగ్ చట్టం చేసిన తరవాత బ్రిటిష్ పార్లమెంటు ప్రతి 20 సంవత్సరాలకు ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో కొనసాగడానికి సంబంధించిన అనుమతిని పునఃపరిశీలించాలని భావించింది. కానీ రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాల దృష్ట్యా 1784లో పిట్స్ ఇండియా చట్టాన్ని చేశారు. అనంతరం(1773 నుంచి 1853 వరకు) బ్రిటిష్ పార్లమెంటు ఈస్టిండియా కంపెనీని క్రమబద్ధీకరించడం, నియంత్రించడానికి ప్రతి 20 సంవత్సరాలకు ఒక చట్టాన్ని చేసింది.

చట్టంలోని ముఖ్యాంశాలు

1) ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీకి భారతదేశంలో 20 సంవత్సరాలు వ్యాపారం చేసుకునే అవకాశాన్ని పొడిగించారు.
2) కంపెనీ వ్యవహారాల వార్షిక నివేదికను బ్రిటన్ పార్లమెంటుకు సమర్పించాలి.
3) గవర్నర్ జనరల్‌కు కౌన్సిల్ తీర్మానాలపై వీటో అధికారాన్ని కల్పించారు.
4) కంపెనీకి వచ్చే లాభాల నుంచే ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించాలి.
5) మున్సిపాలిటీలకు చట్టబద్ధత కల్పించారు.
6) భారతీయులకు సంబంధించిన వారి ఆస్తులు, వివాహం, వారసత్వం, మతం మొదలైన అంశాల్లో బ్రిటిష్ పార్లమెంటు చేసే చట్టాలతోపాటు గవర్నర్ జనరల్ రూపొందించిన నియమాలకు సమానమైన విలువ ఉంటుంది.

చార్టర్ చట్టం-1813: ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీకి 20 సంవత్సరాల వ్యాపార అనుమతి ఇచ్చారు. ఈస్టిండియా కంపెనీలో భారతీయులకు కూడా ఉద్యోగావకాశాలు కల్పించారు. భారతదేశ వ్యాపారంపై ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం (చైనాతో తేయాకు వ్యాపారం మినహా)పోయింది. ప్రతి బ్రిటిష్ పౌరునికి ఇండియాలో వ్యాపార స్వేచ్ఛ కల్పించారు. క్రైస్తవ మిషనరీలు ఇండియాకు వచ్చాయి. స్థానిక సంస్థలకు పన్నులు విధించే అధికారాన్ని కల్పించారు. ఇండియాలో విద్యా వ్యాప్తికి ఒక లక్ష రూపాయలు కేటాయించారు.

చార్టర్ చట్టం-1833: ఈస్టిండియా కంపెనీకి మరో 20 సంవత్సరాలు వ్యాపార అనుమతి ఇచ్చారు. బెంగాల్ గవర్నర్ జనరల్ పదవిని, భారత గవర్నర్ జనరల్‌గా పదోన్నతులు కల్పించారు. మొదటి భారత గవర్నర్ జనరల్- విలియం బెంటింక్. సివిల్ సర్వీస్ పరీక్షల్లో భారతీయులకు ప్రవేశం కల్పించారు. కానీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యతిరేకత వల్ల దీని అమలు ఆగిపోయింది. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను నాలుగుకి పెంచారు. గవర్నర్ కౌన్సిల్‌లో ఒక న్యాయ నిపుణుడైన సభ్యుడిని ఏర్పాటు చేశారు. న్యాయ సభ్యునిగా నియమించిన మొదటి వ్యక్తి - లార్డ్ మెకాలే. ఈయనే భారత 'లా కమిషన్ చైర్మన్‌'గా నియమితులయ్యారు.

చార్టర్ చట్టం-1853: బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి 20 సంవత్సరాల వ్యాపార అనుమతిని పొడిగించలేదు. ఇండియాలో సివిల్ సర్వీసులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. శాసన నిర్మాణంలో భారతీయులకు అవకాశం కల్పించారు. కానీ తుది నిర్ణయం గవర్నర్‌దే. గవర్నర్ జనరల్ విధులను రెండుగా విభజించారు. అవి- 1) శాసన నిర్మాణ విధులు 2) కార్యనిర్వాహక విధులు. అలాగే లా కమిషన్ సిఫార్సులను ప్రకటించారు. అవి- 1) 1859- సివిల్ వివాదాల చట్టం అమలులోకి వచ్చింది(సీపీసీ) 2) 1860- భారత పీనల్‌కోడ్ అమలులోకి వచ్చింది(ఐపీసీ) 3) 1861- క్రిమినల్ చట్టం అమలులోకి వచ్చింది(సీఆర్‌పీసీ). కానీ కంపెనీ హక్కులను పొడిగించే అంశాన్ని ప్రస్తావించలేదు.

భారత రాజ్యాంగచట్టం-1858: ఈ చట్టం ద్వారా దేశంలో ఈస్టిండియా కంపెనీ పాలన అంతమై నేరుగా బ్రిటిష్ పాలన ప్రారంభమైంది. ఈ చట్టంలో బ్రిటిష్ రాణి భారతదేశానికి కూడా మహారాణియే అని ప్రకటించడం ద్వారా దేశంలోని సంస్థానాలు కూడా బ్రిటిష్ ప్రభుత్వం అధికారాన్ని ఒప్పుకోవాల్సి వచ్చింది. భారత గవర్నర్ జనరల్‌ను వైస్రాయ్‌గా మార్చారు. మొదటి వైస్రాయ్ 'లార్డ్ కానింగ్'(చివరి భారత గవర్నర్ జనరల్). 1857 సిపాయిల తిరుగుబాటు కాలంలో గవర్నర్ జనరల్- కానింగ్. బ్రిటన్ మహారాణి భారతదేశానికి కూడా మహారాణియే. బ్రిటిష్ ప్రభుత్వంలో భారత వ్యవహారాల మంత్రిత్వశాఖ ఏర్పాటు జరిగింది. మొదటి భారత వ్యవహారాల మంత్రి, భారత కార్యదర్శి - రిచర్డ్ స్టాన్లీ. భారతదేశం తొలిసారిగా బ్రిటిష్ ప్రత్యక్ష పాలనలోకి వెళ్లింది. 1858 నవంబరు 1న మొదటి విక్టోరియా రాణి ఒక చారిత్రాత్మక ప్రకటన చేసింది. 'భారత ప్రజల అభ్యుదయమే మాకు బలం, వారి కృతజ్ఞతే మాకు పారితోషికం, సర్వశక్తి సంపన్నుడైన భగవంతుడు మాకు, మా ఉద్యోగులకు, భారత ప్రజలకు సేవ చేయడానికి శక్తి సామర్థ్యాలు ఇచ్చు గాక'. భారత వ్యవహారాల మంత్రిత్వపు శాఖ భారత కౌన్సిల్ సభ్యుల సలహా మేరకు పనిచేస్తుంది. ఈ చట్టం ప్రకారం భారతదేశ పాలనా వ్యవస్థ మౌలిక స్థాయిలో ఏర్పడింది.




వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WeVeLPnలో చదవండి.

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీకేజీపీ)- 'మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఆర్‌ఎం)', 'మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)', 'మాస్టర్ ఇన్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎంఎంఎస్‌టీ)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. ● **వెబ్‌సైట్:** iitkgp.ac.in



● **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5

ఎంహెచ్‌ఆర్‌ఎం

సంస్థ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా వింటర్, సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి.

● **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 25

ఎంబీఏ

సంస్థ ఆధ్వర్యంలోని వినోద్ గుప్త స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లకుగాను మొత్తం 91 క్రెడిట్స్ నిర్దేశించారు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి.

ఎంఎంఎస్‌టీ

ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. మెడికల్ సైన్సెస్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వినియోగానికి సంబంధించి శిక్షణ ఇస్తారు. సైన్స్-ఇంజనీరింగ్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ సబ్జెక్టులు, ఎలక్టివ్ సబ్జెక్టులు, సెమినార్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటికి సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

● **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31

ఐఐటీబీ - మోనాష్‌లో పీహెచ్‌డీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే, మోనాష్ యూనివర్సిటీ(ఆస్ట్రేలియా) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'ఐఐటీబీ-మోనాష్ రీసెర్చ్ అకాడమీ' పీహెచ్‌డీ 2024 జూన్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. గేట్ వ్యాలిడ్ స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడు నుంచి నాలుగేళ్ల వరకు ఉంటుంది.

రీసెర్చ్ థీమ్స్

- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటేషనల్ మోడలింగ్
- క్లీన్ ఎనర్జీ
- హెల్త్ సైన్సెస్
- స్మార్ట్ మెటీరియల్స్
- సస్టయినబుల్ సొసైటీస్ అండ్ మేనేజ్‌మెంట్
- సర్క్యులర్ ఎకానమీ
- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** iitbmonash.org







ఇసుక ఇష్టారాజ్యం

- అడ్డేలేకుండా తవ్వకం.. అమ్మకం
- ప్రభుత్వ ధరకు రెట్టింపు వసూలు
- ఒక బిల్లుతో కావాల్సినన్ని ట్రిప్పులు
- బుసక రీచ్‌ల్లోనూ ఇసుక తవ్వకాలు
- అధికారిక రీచ్‌లు మూడే.. అనధికారం లెక్కేలేదు
- మామూళ్ల మత్తులో మునిగి పట్టించుకోని అధికారులు

గుంటూరులో 5 టన్నులు రూ.5,800

ఇసుక ధరలను సప్లయర్లు మళ్లీ పెంచేశారు. ఇటీవల ఇసుక ధర తగ్గించినట్లే తగ్గించి ఒక్కసారిగా రెట్టింపు చేయడంపై భవన నిర్మాణదారులు, సొంత ఇల్లు నిర్మించుకుంటున్న సామాన్యులు తీవ్ర ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు మున్నంగి, వల్లభాపురం రీచ్‌లను కేటాయించారు. అక్కడ టన్ను రూ.475గా ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పాయింట్ల నుంచి గుంటూరు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ దృష్ట్యా టన్నుకు రూ.196 రవాణా చార్జీలను నిర్ణయించారు. మొత్తంగా టన్ను ఇసుక ధర రూ.671 దాటడానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే 5 టన్నుల ట్రాక్టర్ ఇసుక రూ.3,355కి సరఫరా చేయాలి. అయితే సప్లయర్లు ఏకంగా రూ.5,800 డిమాండ్ చేస్తున్నారు. అదే 11 టన్నుల 6 టైర్ల లారీకి రూ.9,500 వసూలు చేస్తున్నారు. 10 టైర్ల లారీకి 27 నుంచి 28 టన్నులు వస్తుందని, టన్ను రూ.800 చొప్పున లెక్కించి రూ.22 వేలు చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో పోల్చితే ట్రాక్టరు, 6 టైర్ల లారీకి దాదాపుగా రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. 10 టైర్ల లారీ విషయానికి వస్తే 35 టన్నులకు పైగా లోడింగ్ చేసి తీసుకొచ్చి అందులో ఆరు, ఏడు టన్నుల ఇసుకని ట్రాక్టర్లలో అన్‌లోడింగ్ చేసి మిగతా 27 టన్నులు రూ.800 చొప్పున టన్నుకు రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు.

ఇసుక వాహనాలు సీజ్ చేయొద్దని అనధికార ఆదేశాలు

జిల్లా వ్యాప్తంగా ఇసుక తరలించే ట్రాక్టర్లు, లారీలను ఎక్కడా సీజ్ చేయొద్దని ప్రభుత్వ పెద్దల నుంచి మైనింగ్, పోలీసు, విజిలెన్స్ తదితర శాఖలకు ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. అలానే రవాణా శాఖకు కూడా ఈ విషయంలో నిర్దిష్టమైన ఆదేశాలు ఉండటంతో ఓవర్ లోడింగ్ జరుగుతున్నా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదు.

ఇసుక.. అధికార పార్టీ నేతలకు కాసులు కురిపిస్తోంది. ఇష్టారీతిన తవ్వుతూ.. తరలిస్తూ కాసులు పోగేసుకుంటున్నారు. అధికారిక రీచ్‌లతో పాటు అనధికార రీచ్‌ల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. నిబంధనలు పట్టించుకోవడంలేదు. కళ్లెదుటే ఇసుక దోపిడీ జరుగుతున్నా మామూళ్ల మత్తులో అధికారులు మునిగిపోయారు. బిల్లులతో పని లేకుండా ఒకే బిల్లుపై పలుమార్లు ఇసుక తరలిపోతున్నా.. పట్టించుకునేవారు లేరు. ప్రభుత్వం వారంవారం పత్రికల్లో ధరను నిర్ణయిస్తూ ప్రకటిస్తున్నా.. వసూలు చేసే ధరకు పొంతనే ఉండటంలేదు. ప్రకాశం బ్యారేజి దిగువున అడ్డులేకుండా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. అధికారిక రీచ్‌లలో ఒక లారీ ఇసుకకు బిల్లు తీసుకుని, ఆ తర్వాత రోజంతా అదే బిల్లుపై దొంగ రీచ్‌లలో పట్టపగలే లెక్కలేనన్ని ట్రిప్పులు తరలిస్తున్నారు. పర్యవేక్షించే అధికారే లేకపోవడంతో ఇష్టారాజ్య మైపోయింది. ఇప్పుడిప్పుడే నిర్మాణ రంగం పుంజుకొంటుండటంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. దీనిని ఆసరగా చేసుకొని సప్లయర్లు దోచుకుంటున్నారు. మైనింగ్ అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితం అవుతున్నారు. కనీసం జిల్లా యంత్రాంగమైనా అక్రమ ఇసుకపై చర్యలు తీసుకోక పోతుండటంపై విమర్శలు చెలరేగుతున్నాయి.

తెనాలి, గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ చూసినా దొంగ ఇసుక... స్థానిక నేతల కనుసన్నల్లో ఒకప్పుడు గుట్టుగా సాగిన ఇసుక రవాణా ఇప్పుడు బహిరంగంగానే సాగిపోతోంది. ఉమ్మడి గుంటూరు పరిధి నుంచి వస్తున్న ఇసుక లారీలను కృష్ణా జిల్లాకు చెందిన రీచ్‌ల నిర్వాహకులు పట్టుకుంటున్నారు. అంటే ఇక్కడ తవ్వి.. తరలిస్తున్నా ఇక్కడి అధికారులు కళ్లుమూసుకున్నట్లుగా అర్థమవుతుంది. బిల్లుతో పనిలేకుండా దొంగతనంగా తరలించడంతో ప్రభుత్వ నిర్ణయ ధరను మించి పెద్దగా పెంచకుండా అమ్మేస్తుంటే, వినియోగదారునికి మేలు జరుగుతున్నా, ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండిపడుతోంది. గతంలో ఉన్న జేపీ సంస్థ తప్పుకున్నాక, ప్రస్తుతం ఇసుక రీచ్‌లలో బిల్లులు జీసీకేసీ ప్రాజెక్ట్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో ఇస్తున్నారు. ఈ కంపెనీ ప్రవేశించాక దుగ్గిరాల మండలం పెదకొండూరు, కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంకలో కొత్త రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇవికాక జగనన్న కాలనీల కోసం బుసక రీచ్‌ల కింద అన్నవరం, వల్లభాపురం దగ్గర అనుమతులిచ్చారని సమాచారం. అయితే ఇవి కాకుండా అనధికారికంగా ఇసుక తవ్వకానికి అవకాశం ఉన్న ప్రతి రీచ్‌లోనూ తవ్వేస్తున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకుంటున్న పరిస్థితిలేదు. పది చక్రాల లారీ లోడు పరిమితి కేవలం 18 టన్నులు మాత్రమే ఉంటే, ఏకంగా 25 టన్నులని బిల్లుపైనే రాసిస్తున్నా, రవాణా, మైనింగ్ అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలే లేవు. ప్రకాశం బ్యారేజి దిగువున కొల్లిపర, మున్నంగి, బొమ్మువానిపాలెం, అన్నవరం, బాపట్ల జిల్లాలోని చిలుమూరు, ఈపూరు, పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరిగిపోతున్నాయి. సోమవారం రాత్రి అన్నవరపులంక దగ్గర్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న రెండు లారీలను కొత్త కంపెనీ సిబ్బంది పట్టుకుని కొల్లిపర పోలీసులకు అప్పగించారనేది సమాచారం. అయితే దీనిపై కేసు నమోదు చేశామని చెబుతున్నా, లారీలు మాత్రం యథేచ్ఛగా బయటే తిరుగుతున్నాయని కొల్లిపరలోని అధికార పార్టీ నాయకులే చెప్పడం విశేషం. నదిలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వడంతో జీసీకేసీ సంస్థ పేరుతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ ఒక బిల్లు రాయించుకుని అదే బిల్లుపై ఇతర చోట్ల ఇసుక పోసుకుని తరలిస్తున్నారు. పది చక్రాల లారీలో కేవలం 18 టన్నుల పరిమాణం వరకు మాత్రమే ఇసుక తరలించేందుకు అనుమతి ఉంటే, అధికారికంగా రీచ్‌లు తెరచిన సంస్థ బిల్లులపైనే ఏకంగా 25 టన్నుల వరకు ఇసుక పోస్తున్నట్లు రాసేసి డబ్బు వసూలు చేయడం విశేషం. ఇది కాగితాలపైనే కనిపిస్తున్నా రవాణా శాఖ కానీ, సెబ్ కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. బిల్లుపై 25 టన్నులని రాసి 40 నుంచి 45 టన్నుల వరకు ఇసుక పోసేసి మిగిలిన పరిమాణానికి కంపెనీనే అనధికారిక దోపిడీకి తెరతీస్తోంది. ఇంతటి ఘరానా దోపిడీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నా అంతా గప్‌చుప్ అన్నట్లు అధికారులు వ్యవహరించటం విశేషం.



జీసీకేసీ సంస్థ పేరుతో కొల్లిపర మండలంలో ఇస్తున్న బిల్లులు, 25 టన్నులు పోస్తున్నట్లు ఉన్న బిల్లు

దొంగ ఇసుకతో భారీగా లబ్ధి

ప్రకాశం బ్యారేజి దిగువున అధికారిక రీచ్‌లలో టన్ను ఇసుక రూ.475కు అమ్మాలని ప్రభుత్వం ధర నిర్ణయించింది. ఉదాహరణకు కొల్లిపర దగ్గర టన్ను ఇసుక రూ.475 ధర ఉంటే, తెనాలికి కిరాయి, ఇతర ఖర్చులు కలిపితే టన్ను రూ.650 వరకు పలుకుతుంది. జేపీ సంస్థ ఉన్న సమయంలోనే బిల్లుపై తీసుకొచ్చిన ఇసుకను తెనాలి పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో టన్ను రూ.750 నుంచి రూ.900 వరకు అమ్మారు. కానీ ఇప్పుడు టన్ను కేవలం రూ.550 నుంచి రూ.600 వరకే పలుకుతుంది. ఇది కొంతవరకు వినియోగదారులకు మేలు జరిగే అంశమే. అయితే వీరికి జరిగే మేలు రూ.50 నుంచి రూ.100 వరకే అయితే దొంగతనంగా ఇసుక తీసుకొచ్చి అమ్ముతున్నవారు మాత్రం రూ.వేలల్లో లబ్ధి పొందుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండికొడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన సెబ్, పోలీస్, మైనింగ్ శాఖలోని విజిలెన్స్ అధికారులు కొన్నిచోట్ల నేతల సిఫార్సులు, మరికొన్నిచోట్ల మామూళ్ల మత్తుతో పట్టించుకోవడంలేదు.

బుసక పేరు చెప్పి తరలింపు..

జగనన్న కాలనీలకు మెరకలు, పునాదుల నుంచి లెంటల్ లెవల్ లోపు గదుల్లో నింపేందుకు బుసక కావాలని అధికార పార్టీ నేతల అనుచరులు అనుమతులు తీసుకున్నారు. అయితే బుసక పేరుచెప్పి ఇసుక తరలిస్తున్నారు. కొల్లిపర మండలం అన్నవరం, బొమ్మువానిపాలెం రీచ్‌లలో బుసకకు అనుమతులిస్తే, మున్నంగి, వల్లబాపురం దగ్గర కూడా తవ్వకాలు చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పగలు బుసక తవ్వుతున్నా, రాత్రి మాత్రం ఇసుక తరలిస్తున్నారు. బొమ్మువానిపాలెం వంటి రీచ్‌ల దగ్గర బుసక అనుమతులున్నా, ఇక్కడే ఇసుక రీచ్‌కు కూడా అనుమతి ఉండటంతో పగలు కూడా అడ్డులేకుండా తరలిస్తున్నారని అధికారిక రీచ్‌ల నిర్వాహకులే చెబుతున్నారు. ఉదాహరణకు బొమ్మువానిపాలెం రీచ్‌కు అనుమతి ఉంటే, ఆ రీచ్‌లో ఒక ట్రిప్‌కు బిల్లు తీసుకుని తర్వాత ట్రిప్పులు ఆ రోజులో ఎన్ని అవకాశం ఉంటే అన్నిటిని పక్కనున్న అన్నవరం, బొమ్మువానిపాలెం బుసక రీచ్‌లలో, మున్నంగి, కొల్లిపర, వల్లభాపురం రీచ్‌లలో తవ్వుకుపోయి అమ్మేసుకుంటున్నారు. ఈ కారణంగా ప్రభుత్వానికి, అటు ఇసుక అనుమతులు దక్కించుకున్న సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. మరో పక్క అధికారిక రీచ్‌లో ఒక లోడ్ 25 టన్నులకు రూ.11,875 చెల్లించి తర్వాత ట్రిప్పులకు అదే బిల్లుపై ఆ రీచ్‌లోనే రూ.7,500 నుంచి రూ.9 వేల వరకు చెల్లించి అనధికారికంగా ఇసుక తరలిస్తున్నారు.



కన్నా లక్ష్మీనారాయణను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నేతలు

సత్తెనపల్లి.. కన్నాకే

ప్రకటించిన టీడీపీ అధిష్ఠానం

- నియోజకవర్గంలో అపోహలకు తెర
- జిల్లాలో తొలి సీటును ప్రకటించిన తెలుగుదేశం
- అధిష్ఠాన నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్న అచ్చెన్నాయుడు

నరసరావుపేట, సత్తెనపల్లి, జనవరి 10: జిల్లాలో టీడీపీ తొలి అభ్యర్థిని ప్రకటించింది. సత్తెనపల్లి అభ్యర్థిగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పేరు ఖరారైంది. ఈ మేరకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు. కొంతకాలంగా కన్నా అభ్యర్థిత్వంపై జరుగుతున్న ప్రచారానికి అధిష్ఠానం తెరదింపింది. నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు మరణానంతరం సత్తెనపల్లిలో ఇన్‌చార్జిను చాలాకాలం నియమించలేదు. నేతల్లో నెలకొన్న విభేదాలకు చెక్ పెడుతూ కన్నాను గత మేలో ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీ క్యాడర్ కూడా ఆయనకు సంపూర్ణ మద్దతు అందిస్తోంది. వివిధ సామాజిక వర్గాల నుంచి కన్నా మద్దతు పొందారు. క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను పార్టీకి అనుకూలంగా మార్చేందుకు కన్నా కృషి చేస్తున్నారు. గతంలో ఇన్‌చార్జి పదవిని ఆశించిన మాజీ ఎమ్మెల్యే వైవీ అంజనేయులు, మల్లి, నాగోతు శౌరయ్య అధిష్ఠానం నిర్ణయాన్ని కట్టుబడి కన్నాకు మద్దతుగా పనిచేస్తున్నారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు వారసుడు డాక్టర్ కోడెల శివరాం మాత్రం సొంతంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కన్నాకు టిక్కెట్ రాదని, గుంటూరు 2 నుంచి పోటీ చేస్తారని, సత్తెనపల్లిలో పోటీ చేసేందుకు సుముఖంగా లేరని, డాక్టర్ కోడెల శివరాం ఇక్కడి నుంచి పోటీ చేస్తారని కోడెల వర్గం చేస్తున్న ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో పార్టీకి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు సదరు ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ కన్నానే సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థిగా ప్రకటిస్తూ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కన్నాను ఎప్పుడైతే ఇన్‌చార్జిగా నియమించారో అనాడే కన్నాకు సీటు నిర్ణయమైపోయిందని అధిష్ఠానం తెలిపింది. పార్టీ నిర్ణయానికి కట్టుబడి నేతలు, కార్యకర్తలు పనిచేయాలని పార్టీ లైన్ తప్పితే అటువంటి వారిని ఉపేక్షించేది లేదని కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన సత్తెనపల్లి నియోజవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నేతలు కొందరు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. చంద్రబాబు ఆదేశాలతోనే సత్తెనపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా కన్నా పోటీ చేస్తారని తాను ప్రకటిస్తున్నట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఎవరైనా టిక్కెట్ తనకే వస్తుందని చెప్పుకుంటే అది అబద్ధపు ప్రచారమేనని, దానిని నమ్మొద్దన్నారు. కన్నా విజయానికి కృషి చేయాలని నియోజకవర్గ శ్రేణులకు సూచించారు. తనకు పార్టీ టిక్కెట్ కేటాయించిన చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు, జీవీ ఆంజనేయులకు కన్నా కృతజ్ఞతలు తెలిపారు.

ఐదు సార్లు ఎమ్మెల్యేగా..

కన్నా లక్ష్మీనారాయణ గతంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1989, 1994, 1999, 2004లో పెదకూరపాడు నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2009లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక శాఖలకు ఆయన మంత్రిగా వ్యవహరించారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన కన్నా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. గత ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. గత ఏడాది ఆయన బీజేపీని వీడి టీడీపీలో చేరారు.



వైరస్ సోకిన మిర్చి మొక్క



అకుమడత తెగులు సోకిన మొక్క తెగులు సోకి కుళ్లి పోతున్న కాయ

మిర్చిపై.. తెగుళ్ల దాడి

- భారీగా తగ్గనున్న దిగుబడులు
- పూతతో పాటు రాలిపోతున్న కాయలు
- చలికాలం ఆరంభం నుంచి పెరిగిన ఉధృతి
- పెట్టుబడులూ తిరిగిరావని రైతుల్లో ఆందోళన
- మూడు జిల్లాలో రెండు లక్షల ఎకరాల పంటపై ప్రభావం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంటల సాగుకు ప్రకృతి సహకరించడంలేదు. అతివృష్టి.. అనావృష్టితో ఇప్పటికే మిరప పంటపై తీవ్ర ప్రభావం చూపించగా ప్రస్తుతం తెగుళ్ల దాడితో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒకటి రెండు కాదు ఏకంగా నాలుగైదు రకాల తెగుళ్ల సోకడంతో రైతులు విలవిలాడుతున్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో నీటి తడి ఖర్చు చాలదనట్లుగా తెగుళ్ల ఆశించాయి. దీంతో పంటను కాపాడు కునేందుకు ఖరీదైన మందులను పిచికారి చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెగుళ్ల కారణంగా పెట్టుబడులూ తిరిగిరావన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. నల్ల తామర, కొమ్మ ఎండు, నల్ల, తెల్ల, పచ్చ నల్లి, ఆకు ముడత, కాయకుళ్ల, వేరు కుళ్ల తెగుళ్ల సోకాయి. చలికాలం ఆరంభం నుంచి తెగుళ్ల ఉధృతి పెరిగింది. తెగుళ్ల వల్ల పూతతో పాటు కాయలు రాలిపోతున్నాయి. మొక్కలు ఎండిపోతున్నాయి.

నాడు ఆసక్తి.. నేడు నిరాశ

మిరపకు మంచి ధర ఉండటంతో పంట సాగుపై రైతులు ఆసక్తి చూపారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 1,89,770 ఎకరాల్లో మిరప సాగైంది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా రైతులు ఈ ఏడాది మిర్చి సాగు చేపట్టారు. తేజ, బాడిగ, వండర్‌హాట్, చపాటా వంటి రకాలను ఎక్కువగా సాగు చేశారు. మొక్కలు నాటినప్పటి నుంచి తీవ్ర వర్షాభావం నెలకొంది. నీటిని కొనుగోలు చేసి తడులిచ్చి పంటను కాపాడుకున్నారు. డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతిన్నది. మళ్లీ నెలరోజులుగా తీవ్ర వర్షాభావం నెలకొంది. పంటను కాపాడుకునేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు. ఎకరాకు రూ.10 నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసి పంటను కాపాడుకుంటున్న తరుణంలో తెగుళ్ల దాడి చేశాయి. అటు వర్షాభావం, ఇటు తెగుళ్ల నుంచి మిరపను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు చెప్పనలవికావు. పంట పూత, కాపు దశలో తెగుళ్ల బెడద మొదలైంది. చలితో పాటు మంచు ఎక్కువగా కురుస్తుండటంతో తెగుళ్ల తీవ్రత పెరిగింది. కొన్ని చోట్ల ఆకుముడత, మచ్చ తెగుళ్ల వల్ల పంటలో ఎదుగుదల లేదు. మొక్కకున్న ఆకులు రాలిపోవడంతో పాటు మొక్కలు ఎండిపోతున్నాయి. కాయలు కుళ్లి ఎండి రాలిపోతున్నాయి. నల్ల తామరతో పూత రాలిపోతున్నది. వైరస్, నల్ల, పచ్చ, తెల్ల నల్లి సోకడంతో కాయ రాలిపోతున్నది. తెగుళ్లతో దిగుబడులు భారీగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు లక్షన్నర ఎకరాల్లో పంటపై తెగుళ్ల ప్రభావం ఉంది. ఈ ఏడాది విత్తనాల ధరలు, సాగు వ్యయం కూలీల ఖర్చులు పెరగడం, మరోవైపు తీవ్ర వర్షాభావంతో నీటి ఖర్చు అధికమైంది. ఇప్పటికి సాగు వ్యయం లక్షన్నర వరకు అయిందని రైతులు చెబుతున్నారు. తెగుళ్ల, వర్షాభావం, అధికవర్షాలకు పంట దెబ్బతినడంతో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని వ్యవసాయశాఖ

తెగుళ్ల నివారణకు నిర్దిష్ట పురుగు మందులు లేకపోవడంతో ఇతర పంటలకు వాడే వాటినే మిరపకు వాడుతున్నారు. పంట యాజమాన్య పద్ధతులు, పురుగు మందులు వినియోగంపై రైతులకు అధికారులు సూచించక పోవడంతో ప్రైవేట్ కంపెనీలు లాభాల కోసం అనేక రకాల పురుగు మందులను సిఫార్సు చేస్తున్నాయి. పంట వేసిన మొదట్లో ఆకు ముడత వైరస్ వాహకంగా ఉండే తెల్లదోమ, ఆ తదుపరి నల్ల తామర, వైరస్ వల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల నివారణకు ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. వర్షాభావం నుంచి కాపాడుకున్న పంటను తెగుళ్ల మింగేస్తుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వాతావరణంలో మార్పులు వస్తే తెగుళ్ల ప్రభావం తగ్గే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

మిరపసాగు జిల్లాల వారీగా..

జిల్లా		సాగు ఎకరాల్లో
పల్నాడు	:	1,25,881
బాపట్ల	:	25,337
గుంటూరు	:	38,550



పొలంలో ఏర్పాటు చేసిన బంక అట్టకు నల్లి పురుగులు



చేయిచేయి కలుపుదాం.. అభివృద్ధి సాధిద్దాం

6లో..

- టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ పిలుపు
- తటస్థ ప్రముఖులతో కొనసాగుతున్న భేటీలు



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

మూడు రాజధానులు చట్ట వ్యతిరేకం

- 1485 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు జనవరి 10: సీఎం జగన్‌రెడ్డి పెట్టిన మూడు రాజధానుల ప్రతిపాదన చట్ట వ్యతిరేకమన్నారు. అందుకే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మూడు రాజధానుల అంశం వద్దు.. అమరావతినే రాష్ట్ర ఏకైక రాజధాని పేర్కొని, అభివృద్ధి పనులను కొనసాగించమని మాండమస్ తీర్పునిచ్చిందని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతుకూలీలు మహిళలు చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 1485వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు ధర్నా శిబిరాల నుంచి పలువురు మాట్లాడుతూ.. పార్లమెంటు చేసిన విభజన చట్టం ప్రకారం ఒన్ క్యాపిటల్ అని ఉందన్నారు. ఆ ఒన్ క్యాపిటల్ అమరావతి ఏర్పడి పోయిందన్నారు. ఏడున్నర ఏళ్ళ నుంచి రాజధాని అమరావతి నుంచే చేసుకొని పాలన సాగుతుందనీ, ఇలాంటప్పుడు మూడు రాజధానులు అన్నవి చట్టవ్యతిరేకమైనవని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

విద్యుత్‌విజిలెన్స్ బృందాల తనిఖీలు

- 141 మందికి రూ.7.63 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, జనవరి 10: విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ (డీపీఈ) కే.సూర్యప్రకాష్, ఆపరేషన్ ఈఈ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 45 మంది అధికారులు 135 మంది సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి ముప్పాళ్ళ, దమ్మాలపాడు, తురకపాలెం, గొల్లపాడు, మాదల, ఇరుకుపాలెంలలో తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2658 సర్వీసులు తనిఖీ చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 141 మందికి రూ.7.63 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని ప్రజలకు సూచించారు.

చేయిచేయి కలుపుదాం.. అభివృద్ధి సాధిద్దాం

- టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ పిలుపు
- తటస్థ ప్రముఖులతో కొనసాగుతున్న భేటీలు



దొంతిరెడ్డి మురళీకృష్ణారెడ్డితో నారా లోకేశ్

తాడేపల్లి టౌన్, జనవరి 10 : రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేయిచేయి కలిపి ముందుకు సాగుదామని, అభివృద్ధిని సాధిద్దామని టీడీపీ జాతీయ కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా, మంగళగిరి నియోజకవర్గంలోని తటస్థ ప్రముఖులతో లోకేశ్ జరుపుతున్న భేటీలలో భాగంగా బుధవారం తాడేపల్లికి చెందిన ప్రముఖులు దొంతిరెడ్డి మురళీకృష్ణారెడ్డి, కాజ లక్ష్మీప్రసాద్, బుద్దా సోమేశ్వరరావులను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తొలుత 4వవార్డులోని మురళీకృష్ణారెడ్డిని కలుసుకుని మాట్లాడారు. అనం తరం తాడేపల్లి మహానాడు కాలనీకి చెందిన ప్రముఖ బీసీ నేత శ్రీప్రతిభ స్కూల్ అధినేత కాజ లక్ష్మీప్రసాద్‌ను ఆయననివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం విలీనం పేరుతో ఎయిడెడ్ పాఠశాలల ఆస్తులను కొల్లగొడుతూ పేద విద్యార్థులకు ద్రోహం చేస్తుందన్నారు. కాగా 23వ వార్డుకు చెందిన బుద్దా సోమేశ్వరరావు (బీసీ ప్రముఖుడు) ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఆరోగ్యసేవలు విస్తరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చి దిద్దడానికి నియోజకవర్గంలోని ప్రముఖులంతా కలిసిరావాలని కోరారు. మరో మూడు నెలల్లో ప్రభుత్వం మారుతుందని, టీడీపీ అన్ని వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని వర్గాల సహాయంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వల్లభనేని వెంకట్రావు, తమ్మిశెట్టి జానకీదేవి, కాటాబత్తుల నిర్మల, దారా దాసు, అన్నెం కుసుమ, కాజ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.



బుద్దా సోమేశ్వరరావుతో నారా లోకేశ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు కాకాణి గోవర్ధనరెడ్డి, అంబటి రాంబాబు, ఇజ్రాయెలు రాయబారి నవోర్ గీలోన్, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు, కలెక్టర్ శివశంకర్

ఇండో-ఇజ్రాయెల్ ప్రాజెక్టు శంకుస్థాపన

- రూ.10 కోట్ల వ్యయంతో 25.57 ఎకరాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మాణం
- హాజరైన మంత్రులు కాకాణి, అంబటి, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు ఇజ్రాయెలు రాయబారి నవోర్ గీలోన్

నకరికల్లు, జనవరి 10 : ఇండో ఇజ్రాయెలు వ్యవసాయ ఆధారిత ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి అందుబాటులోకివస్తే రైతులకు ఎంతో ఉపయోగకరమని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. బుధవారం పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో ఇండో ఇజ్రాయేలు సమర్థత కేంద్రంకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తొలుత ఉద్యానశాఖ ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలతో పాటు సమర్థత కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కేంద్రాల ద్వారా రైతులకు శాస్త్రసాంకేతిక ఆధునిక విధానాలను అందుబాటులోకి తేవడంతో పాటు, శిక్షణ కూడా ఇస్తామన్నారు. మంత్రి అంబటి మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే ఈ కేంద్రం రాష్ట్రంలో రెండవది కావటం, పల్నాడు ప్రాంతంలో ఏర్పాటు చేయటం రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఇజ్రాయెలు రాయబారి నవోర్ గీలోన్ మాట్లాడుతూ భారత్, ఇజ్రాయేలు సత్సంబాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఇండో ఇజ్రాయెలు ప్రాజెక్టులు వ్యవసాయంలో రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. తక్కువ నీటి లభ్యత ఉన్నప్పటికీ ఉన్న వసతులతోనే సాంకేతికతను ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ ఏ శ్యామ్‌ప్రసాదు, అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ, ఎస్.శ్రీధర్, బెన్ని, సాయి మాల కొండారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనార్టీలపై దాడులు పెరిగాయి

- శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్
- వైసీపీ నేతల దాడిలో మృతిచెందిన మస్తాన్‌వలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్లతో కలసి పరామర్శ



షరీఫ్, నరేంద్రలకు మస్తాన్‌వలీ ఫోటోను చూపిస్తూన్న కుటుంబసభ్యులు

చేబ్రోలు, జనవరి10: వైసీపీ ప్రభుత్వం పాలనలో రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీలపై దాడులు పెరిగాయని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ ధ్వజమెత్తారు. పొన్నూరు నియోజకవర్గం, చేబ్రోలు మండలం, కొత్తరెడ్డిపాలెం గ్రామంలో ఇటీవల వైసీపీ నేతల దాడిలో మృతి చెందిన షేక్ మస్తాన్‌వలీ కుటుంబాన్ని బుధవారం ఎంఏ షరీఫ్, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌లు కలసి పరామర్శించారు. మస్తాన్‌వలీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలీ కుటుంబ సభ్యులు షరీఫ్ వద్ద కన్నీరుమున్నీరవుతూ తమ ఆవేదనను వెలిబుచ్చారు. షరీఫ్ వారిని ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం షరీఫ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందని దుయ్యబట్టారు. కల్లబొల్లి మాటలతో ముస్లిం ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌రెడ్డి గతంలో ముస్లింలకు టీడీపీ అందించిన సంక్షేమ పథకాలన్నింటినీ నిలిపివేసిందన్నారు. టీడీపీ హయాంలో అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను గురించి గుర్తు చేసారు. వచ్చే టీడీపీ ప్రభుత్వంలో ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి ముస్లింల అభ్యున్నతికి వడ్డీలేని రుణాలు ఇవ్వనున్నట్లు నారా లోకేశ్ హామీ ఇచ్చారని అన్నారు. రానున్న ఎన్నికలో ప్రతి ముస్లీం టీడీపీకి అండగా నిలవాలని షరీఫ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, ముస్లీంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇజ్రాయిల్ రాయబారి నవోర్ గీలోన్

భారత్ -ఇజ్రాయిల్ సంబంధాలు మరింత బలోపేతం

- ఇజ్రాయిల్ రాయబారి నవోర్ గీలోన్

గుంటూరు(విద్య),జనవరి 10: భారత్-ఇజ్రాయిల్ దేశాలమధ్య వ్యవసాయ రంగం విభాగంలో టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని భారతదేశంలో ఇజ్రాయిల్ రాయబారి నవోర్‌గిలోన్ అన్నారు. చేబ్రోలుమండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీని ఆయన బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్‌తో పాటు దౌత్యపరమైన అంశాల గురించి విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్‌తో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ రాయబారి నవోర్ గిలోన్‌తో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వివిధ విభాగాల డీన్లు, అధిపతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాబోయే కాలంలో ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సరికొత్త టెక్నాలజీ, ఇండస్ట్రీ, అకడ మియా ప్రోగ్రామ్స్ రూపొందిచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	90, 99, 108
చికెన్ విత్ స్కిన్	174.00
చికెన్ స్కిన్ లెస్	184.00

70,571 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 72,053 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 70,571 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 41,837 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	20000	334	13500	19000
నెంబరు. 5	9000	17500	నెంబరు. 5	–	–
273	10000	16000	273	–	–
341	9000	20000	341	10500	17800
4884	11500	15500	4884	–	–
సూపర్ 10	--	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	22700	తేజ	11000	21000
బ్యాడిగి	8500	23000	బ్యాడిగి	11000	13500
దేవనూరు డీలక్స్	9500	21000	దేనసూరు డీలక్స్	–	–
తెల్లకాయలు	5000	13000	తెల్లకాయలు	5000	12000



రైతు సేవా కేంద్రం ఊహాచిత్రం, పూర్వ విద్యార్థి హరిప్రసాద్

పూర్వ విద్యార్థి సంకల్పం..
రైతు సేవాకేంద్రం నిర్మాణం

- విశ్వవిద్యాలయం అనుమతులు జారీ
- ఫిబ్రవరి 11 న నిర్మాణ పనులకు శ్రీకారం

బాపట్ల, జనవరి 10 : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాలలో రైతు సేవా కేంద్రం ఏర్పాటుచేసి ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయాలని కళాశాల పూర్వ విద్యార్థి (1980 బ్యాచ్) సుంకు హరిప్రసాద్ సంకల్పించారు. కేంద్రం నిర్మాణానికి రూ.50 లక్షలు విరాళం ప్రకటించారు. ఆయన ఆలోచన, ప్రయత్నానికి యూనివర్సిటీ నుంచి తాజాగా అనుమతులు వచ్చాయి. దీంతో ఫిబ్రవరి 11న భూమిపూజ చేసేందుకు ముందుకొచ్చారు. 75 సంవత్సరాల కళాశాల చరిత్రలో ఇంత వరకు వ్యక్తిగతంగా ఇంత భారీ ఆర్థిక సహకారం అందించిన వారులేరు. అనంతపురంజిల్లా తాడిపత్రి రైతు కుటుంబానికి చెందిన హరిప్రసాద్ ఇంటర్ వరకు అక్కడే చదువుకొని 1980లో బాపట్ల వ్యవసాయ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. ఆతర్వాత ఎంబీఏ పూర్తిచేసి అనేక కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేసి అపార అనుభవం గడించారు. తర్వాత ఆయనే స్వయంగా 1992లో ఎగుమతులు, దిగుమతులు, పలు ఉత్పత్తి తయారికి సంబంధించిన వ్యాపారం ప్రారంభించి అంచలంచలుగా ఎదిగి అనేకమందికి మార్గదర్శిగా నిలిచారు. ప్రస్తుతం బెంగుళూరు కేంద్రంగా మేవాగ్రూప్ కంపెనీల ఎండిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 11నే వ్యవసాయ సమాచార కేంద్రం నిర్మాణంతో పాటు, విద్యార్థుల సహకారంతో నిర్మించిన అతిథిగృహాన్ని ప్రారంభించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రైవేటు బ్యాంకు సిబ్బంది వేధిపులతో
యువకుడు బలవన్మరణం

దాచేపల్లి, జనవరి 10: ప్రైవేటు బ్యాంకు రికవరీ ఏజెంట్లు వేధింపులు తాళలేక ఓ యువకుడు బలవన్మరణం పొందిన సంఘటన బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ నడికూడి గ్రామంలో జరిగింది. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోళ్ల అజయ్‌కుమార్ (31) పిడుగురాళ్లలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగిగా పనిచేస్తూ ప్రైవేటు బ్యాంకులో రూ.7 లక్షలకుపైగా రుణంపొందాడు. తీసుకున్న రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా డిసెంబరులో ఈఎంఐ చెల్లించకపోయాడు. దీంతో బ్యాంక్ రికవరీ సిబ్బంది రోజుకు 40 నుండి 50 సార్లు ఫోన్‌చేసి ఈఎంఐ కట్టాలంటూ తీవ్ర ఒత్తిడి చేశారు. దీంతో మానసిక ఆవేదనకు గురైన అజయ్‌కుమార్ తన నివాస గృహంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి వివాహం కాలేదు. తండ్రి సాంబశివరావు, తల్లి వున్నారు. ప్రతినెల చెల్లిస్తున్నా, ఒక నెల వాయిదాకే బ్యాంక్ సిబ్బంది అజయ్‌కుమార్‌ను తీవ్రంగా వేధించారని, దీంతో ఏర్పడిన మానసిక ఒత్తిడి వల్లనే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం కుటుంబ సభ్యులు అజయ్‌కుమార్ ఆత్మహత్య విషయాన్ని దాచేపల్లి పోలీసులకు తెలియ జేశారు.

కృష్ణానదిలో పడి యువకుడి మృతి

దాచేపల్లి, జనవరి10: దాచేపల్లిమండలం తంగెడ వద్ద కృష్ణానదిలో చేపలుపడుతూ ప్రమాదవశాత్తు నదిలోపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం తంగెడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతుల క్రాంతి కుమార్(29) వ్యవసాయకూలీగా, సిమెంట్ ఫ్యాక్టరీలో చిరు ఉద్యోగిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఖాళీ సమయంలో గ్రామానికి సమీపంగా వున్న కృష్ణానదిలో చేపలు పడుతూ షికారు కొడుతుంటాడు. మంగళవారం నదిలోచేపలు పట్టేందుకు వెళ్లిన క్రాంతికుమార్ ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆ రాత్రంతా నదిలో వెతుకులాట ప్రారంభించగా బుధవారం మృతదేహం లభ్యమైంది. మృతుడు క్రాంతి కుమార్‌కు భార్య రాజేశ్వరి, ఐదు, రెండేళ్ల వయసు కలిగిన బాలిక, బాలుడు వున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనలు, విస్తరణలు చేపట్టాలి

- ముగిసిన 53వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం



సమావేశంలో పాల్గొన్న వీసీ, పరిశోధన సంచాలకులు

లాంఫాం(తాడికొండ)జనవరి 10: వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి కొత్త పరిశోధనలు, విస్తరణలు చేపట్టాల్సిన అవశ్యకత ఎంతో ఉందని రైతులు, ఎన్‌జీవోలు సూచించారు. ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న 53వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం బుధవారంతో ముగిసింది. రెండవ రోజు సమావేశంలో బెంగుళూరుకు చెందిన డాక్టర్ పీ.డీ కమల జయంతి సీమియో కెమికల్స్, స్థిరమైన సమగ్ర సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఐఐఆర్ హైదరాబాద్ నుంచి డాక్టర్ ఎం.సోమశేఖర్ 'వ్యవసాయంలో మొక్కల పరాన్నజీవ నెమటోడ్ల సమస్యల నిర్వహణ' అనే అంశంపై మాట్లాడారు. ఐసీఏఆర్, ఎన్ఐఏఎస్‌ఎం భారమతి డైరక్టర్ డాక్టర్ కే.సమ్మిరెడ్డి 'కార్బన్ క్రెడిట్' అనే అంశంపై అవగాహన కల్పించారు. ముత్యాల సాగు, కుంకుమ పువ్వు సాగుపై రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ప్రధాన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వ్యవసాయంలో కొత్త అంశాల్ని గుర్తించి వాటిపై ఈ సంవత్సరంలో పరిశోధనలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీ దేవి, స్పెషల్ ఆఫీసర్, మాజీ వీసీ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్ ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఏ.సుబ్బారామిరెడ్డి, పాలక మండలిసభ్యులు డాక్టర్ పీవీ సత్యగోపాల్, శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ పీ.రాఘవరెడ్డి, డాక్టర్ శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో
యువకుడి మృతి

కారంపూడి, జనవరి 10: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పేటసన్నిగండ్ల తండాలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన శ్రీనునాయక్ (26) పొలంలోని మోటారుకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పక్కనేవున్న స్తంభాన్ని ఎక్కి ఫీజ్ వేసేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తూ మెయిన్ వైర్ తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామాంజినేయులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.



పార్టీ నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

14న పల్నాడు యువతతో ఆత్మీయ సమావేశం

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, జనవరి 10 : సంక్రాంతి సంబరాలలో భాగంగా మాజీ ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గానికి చెందిన దేశ విదేశాలు, ఐటి రంగంలో ఉద్యోగం చేస్తూ బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై, విశాఖ, పూణెతో పాటు మరికొన్ని ప్రాంతాలలో వున్న యువతీ, యువకులతో కలిసి ఈ నెల 14వ తేదీన ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. దాచేప ల్లిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలో పంట పొలాల్లో ఆత్మీయ సమావేశానికి కావలసిన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. యరపతినేని శ్రీనివాసరావు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ నెల 14న భోగి పండుగ రోజున యువకులతో కలిసి సంక్రాంతి సంబరాలు చేపట్టనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని యరపతినేని తెలిపారు. భారీ ఏర్పాట్లతో సంబరాలను నిర్వహించాలని పెద్దఎత్తున సన్నాహాలు చేపడుతున్నారు. దీనికి అందుబాటులో వున్న నేతలతో ఆత్మీయ సమావేశం అత్యంత ఘనంగా జరిగే విధంగా తీసుకోవలసిన అంశాలపై టీడీపీ, జనసేన నాయకులతో పలు సూచ నలు, సలహాలతో చర్చించారు. ఈ సమావేశంలో గుంటుపల్లి నాగేశ్వరరావు, పులుకూరి కాంతారావు, తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, వేముల తిరుమలకుమార్, నర్రా వుల్లయ్య, చింతపల్లి హసన్ అహ్మద్, వేముల వినోద్‌రెడ్డి, జనసేన నాయకులు కటకం అంకారావు, మందపాటి దుర్గారావు, ఉప్పిడి నరసింహారావు, అంబటి మల్లి, తోట నాగేశ్వరరావు, నలబోతుల శ్రీను, పురంశెట్టి పరంజ్యోతి, గోళ్ల నారాయణ, తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

పిడుగురాళ్ల, జనవరి 10 : పారిశుధ్య కార్మికుల డిమాండ్‌లను నెరవేర్చాలని గత 16 రోజులుగా పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్‌లో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం ఆకులు, చెట్టుకొమ్మలు ధరించి అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. మున్సిపల్ వర్కర్ల సమ్మెకు అంగన్‌వాడీ వర్కర్స్ కూడా సంఘీభావం తెలిపింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను, పారిశుధ్య కార్మికులు సీతారామయ్య, కొండలు, అంగడి రామారావు, దేవర శ్రీనివాసరావు, ఉల్లిగడ్డల రామారావు, వెంకటేశ్వర్లు, సురేంద్ర, సాగర్‌బాబు, బ్రహ్మయ్య, అనంతలక్ష్మీ, వజ్రగిరి మేరి, లక్ష్మీ, పున్నమ్మ పాల్గొన్నారు.

● మాచర్ల, రూరల్, జనవరి 10 : తమ డిమాండ్ల సాధనకై మున్సిపల్ కార్మి కులు పట్టణంలో చేపట్టిన సమ్మె బుధవారానికి 16వ రోజుకు చేరింది. తమ స మస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేత బండ్ల మహేష్, అబ్రహం లింకన్, అరుణ, అనసూయ, చిన్నమ్మాయి పాల్గొన్నారు.

మోడరన్ హరిదాసు



హరిదాసు వెంకట్రామయ్య

పిడుగురాళ్ల, జనవరి 10 : ఆధునిక యుగంలో టెక్నాలజీని ప్రతి ఒక్కరు అందిపుచ్చుకుంటున్నారు. ఇందులో సంక్రాంతి హరిదాసులు ఏమాత్రం తీసి పోరన్నట్లుగా పిడుగురాళ్లలో హరిదాసు వెంకట్రా మయ్య సంక్రాంతి పాటలు, పద్యాలు నోటితో పాడకుండా రికార్డు చేసిన పాటలు, పద్యాలను లౌడ్ స్పీకర్‌తో వినిపిస్తూ పిడుగురాళ్లలోని పలు వీధులలో తిరుగుతూ సంక్రాంతి కానుకలను సేకరిస్తున్న హరిదాసును చూసి మోడ్రన్ హరిదాసుగా చెప్పుకుంటున్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

మాచవరం జనవరి 10: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పిడుగురాళ్లలోని పల్నాడు హాస్పటల్, చింతలపూడి చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు హాస్పటల్ వైద్యులు చింతలపూడి అశోక్‌కుమార్, రమ్యహారిక, సర్పంచ్ రాగిడి నరేష్, పుసులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

మాచవరం, జనవరి 10 : మండలంలోని పలు గ్రామాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ప్రారంభించారు. వేమవరంలో క్రికెట్ పోటీలను జడ్పీటీసీ శివయాదవ్ ప్రారంభించగా పిల్లుట్ల, మాచవరంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మీరెడ్డి ప్రారంభించారు. వేమవరంలో క్రికెట్ పోటీలు, పిల్లుట్ల, మాచవరంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గాదె కనకారెడ్డి, రాగిడి నరేష్, లఘుమవరపు శివపార్వతి సాంబశివరావు, వైసీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జిలుగు నరసింహారెడ్డి, ఉప ఎంపీపీ చింతపల్లి నన్నేసైదా, వట్టె రామిరెడ్డి, మండ్ల రామకోటయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చౌడేశ్వరీ

రెంటచింతల, జనవరి 10 : నరసరావుపేట లోకసభ సభ్యుడు లావు శ్రీ కృష్ణదేవరాయలు మంజూరు చేసిన ఎంపీ ల్యాడ్స్ నిధులతో తుమ్మకోటలోని ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరీ చెప్పారు. 7వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించారు. ఉపాధి హామీ, వీధి దీపాలు, తాగునీటి సమస్య, ఆరోగ్యసురక్ష 2, ఆడుదాం ఆం ధ్ర తదితర వాటిపై చర్చ జరిగింది. పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మల్లవరంలో రూ.15 లక్షలతో ఎన్‌ఆర్‌ఈజీ నిధులతో చేపట్టిన బ్రిడ్జి పనులు పూర్తయ్యాయన్నారు. వివిధ శాఖల సిబ్బంది తమ మొబైల్ ఫోన్లను స్విచ్చాప్ చేయవద్దని డీడీవో వై.మహాలక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు శౌరె డ్డి, సర్పంచ్ పేర్ల చౌడమ్మ, ఎంపీటీసీలు, ఉపాధి హామీ ఏపీవో జయచంద్ర, టీఏ వెంకయ్య పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

రెంటచింతల, జనవరి 10 : యువత క్రీడలపై దృష్టి సారించాలని, అప్పుడే శారీరకంగా మానసికంగా ఉల్లాసంగా ఉండడానికి అవకాశం ఉంటుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీడీవో వై.మహాలక్ష్మి, ఎంపీపీ చౌడేశ్వరీ,జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, వైసీపీ మండల మాజీ కన్వీనర్ పూజల రామయ్య, యార్డు మాజీ ఉపాధ్యక్షులు ఆదూరి ఇన్నారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాపరెడ్డి, ముత్తయ్య యాదవ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు చీదెళ్ల మృతి

మాచవరం, జనవరి 10 : మండలంలోని వేమవరంనకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు చీదెళ్ల వెంకటేశ్వర్లు (40) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. పిడుగురాళ్ల బీజేపీ సీనియర్ నాయకులు యేలూరి శశి, తదితర నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎస్మాకు భయపడం

● 30వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలంటూ శిబిరంలో నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

పిడుగురాళ్ల, జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోగా ఎస్మా చట్టంతో భయపెట్టాలని చూస్తే ఏ ఒక్కరు భయపడరని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హజ్రా, శాంతమణి తెలిపారు. పిడుగురాళ్ల ఆర్అండ్‌బి బంగ్లా వద్ద బుధవారం మాచవరం, పిడుగురాళ్ల మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన చేపట్టారు. పగటిపూటే శిబిరంలో పడుకొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.

షోకాజ్ నోటీసులు

సమ్మెను విరమించి వెంటనే విధులకు హాజరుకావాలంటూ పిడుగురాళ్ల ఐసీడీఎస్ అధికారులు ప్రాజెక్టు పరిధిలోని పలువురు అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అంగన్‌వాడీ కేంద్ర ఉద్యోగ నియమ నిబంధనల ఉల్లంఘన, తగు క్రమశిక్షణ చర్యలు తీసుకొనుటకు నోటీసులు జారీ చేశారు. పిడుగురాళ్ల, మాచవరం మండలాల పరిధిలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు నోటీసులు జారీచేయడం జరిగింది.

● సత్తెనపల్లి, జనవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను భయ పెట్టడం మానివేసి వారి సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె చలమయ్య అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ తాలూకా సెంటర్‌లో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ శిబిరాన్ని సందర్శించి చలమయ్య మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల, కార్మికుల పోరాటాలపై గతంలో ఎస్మాను ప్రయోగించిన ముఖ్యమంత్రులంతా అధికారాన్ని కోల్పోయారని, జగన్ కూడా ఆ జాబితాలో చేరేందుకు సిద్ధపడాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు మల్లేశ్వరి, పెండాల మహేష్, సుజాత, అహల్యా, ధనలక్ష్మి, చాముండేశ్వరి, దుర్గా భవానీ పాల్గొన్నారు.

● మాచర్ల, జనవరి 10 : తమ సమస్యల పరిష్కారం కోసం పట్టణంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతూనే ఉంది. అంగన్‌వాడీలు కుండలు బద్దలు కొట్టి చెబుతున్నాం అంటూ మట్టి కుంటను పగులకొట్టి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, ఇందిర, పద్మావతి, శాంతలత, కోటేశ్వరి పాల్గొన్నారు.

● పెదకూరపాడు, జనవరి 10 : అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పొడపాడు సర్పంచ్ కాసరబాద రూపలక్ష్మి హనుమంతరావు, మాజీ సర్పంచ్ షేక్ మస్తాన్ షరీఫ్ అన్నారు. పెదకూరపాడులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు బుధవారం వారు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి లక్ష్మీనరసమ్మ, నేతలు చెరుకూరి సామ్రాజ్యం, బోడపాటి నాగ జ్యోతి పాల్గొన్నారు.

● గురజాల టౌన్, జనవరి 10: గురజాలలో బుధవారం అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. మోకాళ్లపై కూర్చొని ఏడుస్తూ, ఒంటి కాలిపై నిల్చొని దండం పెడుతూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

● అమరావతి, జనవరి 10 : అంగనవాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం గత 30 రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమాలను నిర్వీర్యం చేసేందుకు స్థానిక వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని, తమ అధికార బలంతో ఒకరిద్దరిని దీక్షలో పాల్గొనకుండా ఆపినంత మాత్రాన వైసీపీ నాయకులు సాధించేది ఏమి లేదని టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు షేక్ ఖాన్‌సాహెబ్ అన్నారు. అంగనవాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని బుధవారం సందర్శించి వారికి తన సంఘీభావం తెలిపారు. అంగనవాడీ కార్యకర్తలు వైసీపీ నాయకుల మాటలు నమ్మి మీ హక్కులను నీరు గార్చుకోవద్దని, ఉద్యమానికి టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.నూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల గీత దాటితే సస్పెన్షన్ : గురజాల డీఎస్పీ

పిడుగురాళ్ల, జనవరి 10 : ఇప్పటిదాకా ఏ విధంగా ఎవరికి అనుకూలంగా వున్నారో అవన్నీ పక్కన పెట్టండి... ఎన్నికల వేళ గీత దాటితే సస్పెండ్ అయ్యేలా నిబంధనలు వున్నాయని గురజాల డీఎస్పీ పళ్లంరాజు స్పష్టం చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలో ఉన్న సీఐలు, ఎస్ఐలకు ఎన్నికల విధులు, బాధ్యతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పళ్లంరాజు మాట్లాడుతూ ఇప్పటి దాకా కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా వున్నారని, ఎన్నికల వేళ అలాగే వ్యవహరిస్తే జనంలో పోలీసులంటే గౌరవం తగ్గిపోతుందన్నారు. ఇప్పటిదాకా చేసినదంతా పక్కనపెట్టండి... ఇకనుండి గ్రామాలలోకి వెళ్లి పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలను కలిసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరాలన్నారు. సత్తెనపల్లి అడిషనల్ ఎపీపీ బంగి నరసింహారావు, పలువురు న్యాయసంబంధిత అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు పివి ఆంజనేయులు, సురేంద్ర, శరత్‌బాబు, షమీముల్లా, బాలకృష్ణ, జయకుమార్; ఎస్ఐలు రబ్బాని, కోటయ్య, పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంపై అవగాహన

మాచర్ల, జనవరి 10 : ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమంపై బుధవారం ఐటీడీఏ జిల్లా నోడల్ ఆఫీసర్ ధనుంజయ ఆధ్వర్యాన పట్టణంలోని జయంతినగర్‌తోపాటు, మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అర్హులైన చెంచు లబ్ధిదారులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మల్లుస్వామి, తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీవో సరోజినిదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

● దుర్గి, జనవరి 10 : మండలంలోని తేరాలలో బుధవారం నోడల్ జిల్లా అధికారి ధనుంజయ ఆధ్వర్యాన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంపై చెంచులకు అవగాహన కల్పించారు. అర్హులైన చెంచు లబ్ధిదారులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగనబోయిన చిన వెంకటేశ్వర్లు, ఐటీడీఏ సెక్షన్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలసిన తెలుగు మహిళలు

సత్తెనపల్లి, జనవరి 10 : టీడీపీ జాతీయ కార్యాయంలో బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఆయన సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణను అఖండ మెజార్టీతో గెలిపించాలని వారికి సూచించారు. ఆయనను కలసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బీమినేని వందనాదేవి, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ, కౌన్సిలర్ తురకా మేరీ గ్రేస్, మాజీ కౌన్సిలర్ తోట అంబిక ఉన్నారు.

అంబేద్కర్ స్మృతి వనం పోస్టర్లు ఆవిష్కరణ

క్రోసూరు, జనవరి 10 : విజయవాడలో ఈనెల 19న ప్రారంభం కానున్న అంబేద్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవ పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు క్రోసూరులో ఆవిష్కరించారు. 400 కోట్ల రూపాయల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో సర్వాంగ సుందరంగా 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేసినట్లు చెప్పారు.

ఏరియా ఆస్పత్రికి రూ.3 లక్షలు మంజూరు

సత్తెనపల్లి, జనవరి 10 : సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధికి ఏపీఎంఎస్ ఐడీఈఈ శ్రీధర్ రూ.3 లక్షలు మంజూరు చేశారని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ నిధులను ఆస్పత్రి అభివృద్ధికి కేటాయించనున్నట్లు ఆయన చెప్పారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

క్రోసూరు, జనవరి 10 : ఎస్‌టీయూ క్రోసూరు మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎం.రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యాజలి రాంబాబులను ఎన్నిక చేశారు. ఆర్థిక కార్యదర్శిగా కర్రా రవికుమార్, గౌరవ అధ్యక్షుడిగా చెరుకూరి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకునిగా కాకర్ల గంగాధర్ వ్యవహరించారు. ఈనెల 12, 13 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం వజ్రోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సాతులూరి రాఘవ తెలిపారు.

ఘనంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు

దుర్గి, జనవరి 10: మండలంలోని ఆత్మకూరు సెయింట్ మార్టిన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బుధవారం ఫాదర్ మోపూరి రాయపరెడ్డి గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరిపారు. ముఖ్య అతిథులుగా హాజరైన బిషప్ గాలిబాలి, ఫాదర్ చిన్నాబత్తిని భాగ్యయ్య మాట్లాడుతూ రాయపరెడ్డి ఉపాధ్యాయునిగా, దైవ సేవకులుగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం ఫాదర్ రాయపరెడ్డిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు రత్నబాబు, ఫాతిమామర్రెడ్డి, గాదె కిరీటి రెడ్డి, మోరా భాస్కరరెడ్డి, నాగిరెడ్డి, మర్రెడ్డి, శాంతిరెడ్డి, చిన్నపురెడ్డి, ఆంతోనిరెడ్డి, సిస్టర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో సంక్రాంతి సంబరాలు

పెదకూరపాడు, జనవరి 10 : పెదకూరపాడులోని కాకతీయ విద్యా సంస్థల గ్రౌండ్‌లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ శీలమనేని ఇందిరాదేవి, కరస్పాండెంట్ కార్యదర్శి బీవీ లలితబాబు ప్రోత్సాహక బహుమతులను బుధవారం అందించారు. అందరి ఇంట సంక్రాంతి సంతోషాలు నిలవాలని వారు ఆకాంక్షించారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

సత్తెనపల్లి, జనవరి 10 : పట్టణంలోని విద్యా కేంద్రం పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో పాల్గొన్న ర్యాండ్ మార్క్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎండీ వెంకట హరి ప్రసాదు, ఆయన భార్య సాయి సంపదలు సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డీ.వెంకటేశ్వ రరావు, ప్రిన్సిపాల్ నారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా ర్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

సత్తెనపల్లి, జనవరి 10 : కోనసీమ అల్లర్ల కేసులు ఎత్తి వేయటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయకుమార్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేసులను ఎత్తివేస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాతంగి సుధాకర్, పొరబండి ఆంతోని, వర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన ముఖ్యమంత్రి

సత్తెనపల్లి, జనవరి 10 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాల పదవుల్లో మాదిగలకు అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగాల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ కోటాలో ఇచ్చిన పదవుల్లో కేవలం 35 శాతం మాత్రమే ఇచ్చారన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీ, కార్పొరేషన్‌ల చైర్మన్, డైరెక్టర్లు, ఎస్సీ కమిషన్ చైర్మన్ తదితర పదవుల్లో మాదిగలకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు.


గారపాడులో క్రీడా పోటీలు

పెదకూరపాడు, జనవరి 10 : మండలంలోని గారపాడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను మండల స్పెషల్ అధికారిణి ధనలక్ష్మి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జడ్పీటీసీ కంకణాల స్వర్ణ కుమారి శివాజీ, మాజీ జడ్పీటీసీ షేక్ మస్తాన్ షరీఫ్, మాజీ సర్పంచ్ గణేష్ మాధవరావు, మాజీ ఎంపీటీసీ కొండవీటి వెంకటేశ్వరరావు, పీడీ సీహెచ్ వెంకట నాగరాజు పాల్గొన్నారు.

అదనపు లోడు కింద రూ.6.4 లక్షల పెనాల్టీ

అమరావతి, జనవరి 10 : మండల పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీలలో 3,342 సర్వీసులను తనిఖీ చేయగా వాటిలో 105 సర్వీసులకు అదనపు లోడు గుర్తించి రూ.6,40,000 పెనాల్టీ విధించడం జరిగిందని ట్రాన్స్‌కో ఏఈ అశోక్‌కుమార్ తెలిపారు. తనిఖీలలో సీఆర్‌డీఏ ఎస్‌ఈ పి.విజయకుమార్, ఈఈ టి.తులసీరామ్, విజిలెన్స్ ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ కేవీ కోటేశ్వరరావు పర్యవేక్షించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్చమ్మకుంట పొలాల్లో పెద్ద పులి సంచారం



పెద్ద పులి అడుగు కొలతలు వేస్తున్న చిత్రం

మాచర్ల, జనవరి 10: మండలంలోని అచ్చమ్మకుంట గ్రామ పొలాల్లో పెద్ద పులి సంచరిస్తోంది. గ్రామస్తుల సమాచారంతో ఫారెస్ట్ అధికారులు అక్కడకు చేరుకొని పరిశీలించి పులి పాదముద్రలను గుర్తించారు. పులి అడుగును కొలతలు వేసి 16ఇన్‌టు18గా తేల్చారు. అలాగే ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను అమర్చారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాత్రి వేళల్లో ఇళ్ల వదిలి బయటకు రావద్దని సూచించారు.

ప్రతి ఒక్క నిరు పేదకు గృహలక్ష్మి పథకం

బెల్లంకొండ, జనవరి 10 : ప్రతి ఒక్క నిరు పేదకు, ఇళ్ళు లేని వారికి గృహ లక్ష్మి పథకం అమలవుతుందని మండల అధ్యక్షురాలు చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బెల్లంకొండలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు బుధవారం పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ సర్పంచ్ మహమ్మద్ పాషా, మాజీ సర్పంచ్ బెల్లంకొండ షరీఫ్, చింతారెడ్డి సాయిరెడ్డి, జాన్ పీర, బడె బచ్చ, మిల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ మృతి పార్టీకి తీరని లోటు

బెల్లంకొండ, జనవరి 10 : బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకురాలైన కే.తిరుపతమ్మ మృతి పార్టీకి తీరని లోటు అని టీడీపీ నాయకుడు గుడిసె కొండయ్య పేర్కొన్నారు. టీడీపీ నాయకులు బుధవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సంతాపం ప్రకటించిన వారిలో టీడీపీ నాయకులు బంగారయ్య, చెన్నయ్య, పూర్ణయ్య పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డిలు తిరుపతమ్మ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సంతాపం ప్రకటించారు.



నరసింగపాడులోని కాశీ విశ్వేశ్వర స్వామిని బుధవారం సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు. - నకరికల్లు.



పెదకూరపాడు మండలంలోని లింగంగుంట్లలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి

రాక్షస పాలనకు ఇక మూడు నెలలే : కొమ్మాలపాటి

పెదకూరపాడు, జనవరి 10 : రైతు నుంచి చిన్న పిల్లాడి వరకు అంతా జగన్ బాధితులేనని, ఈ రాక్షస పాలనకు మిగిలింది మూడు నెలలేనని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మండలంలోని లింగంగుంట్ల, హుస్సేన్‌నగరం, కంభంపాడు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలు జగన్ బాధితులుగా మారారని, నిన్నటి వరకు చిన్న పిల్లలు ఆయన బాధితుల జాబితాలో లేరని, కాని ఇప్పుడు అంగన్‌వాడీల సమ్మె కారణంగా చిన్న పిల్లలు కూడా జగన్ బాధితులుగా మారిపోయారన్నారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే జరుగుతుందన్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు నష్టపోతే ఆదుకొనే దిక్కు కూడా లేకుండా పోయిందన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, టీడీపీ మండల నేతలు మద్దినేని నరసింహారావు, నెల్లూరి మల్లిఖార్జున్, వెల్లల చెరువు సురేష్, వీరవనేని మురళీ, బోడపాటి సుదర్శనరావు, గంగినేని వెంకటేశ్వరరావు, సారెకుక్క నాగేశ్వరరావు, అర్తిమళ్ల వెంకటేశ్వర్లు, అర్తిమళ్ల కృష్ణ, మాదినేని వెంకటరావు, నంబూరు నాగేశ్వరరావు ఉన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం అరాచక పాలనకు పరాకాష్ట

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం జగన్‌రెడ్డి అరాచక పాలనకు పరాకాష్ట అని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శ్రీధర్ మాట్లాడుతూ తక్షణమే జీవో నెంబరు-2ను ఉపసంహరించుకోవాలని, అంగన్ వాడీల కన్నీటిలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొట్టుకుపోవటం ఖాయమ న్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని, అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నది జీతాల పెంపుపై అయినప్పుడు సమ్మె చేసిన కాలానికి వేతనాలు తగ్గించటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అంగన్‌వాడీల పోరాటానికి టీడీపీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, అంతిమ విజయం అంగన్‌వాడీలదేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్, హనుమంత్ నాయక్, లక్ష్మీబాయి, పొన్నగంటి రవి, బొల్లయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టేక్ హోమ్ రేషన్‌ను సక్రమంగా అమలు చేయాలి : జేసీ



అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న జేసీ శ్యామ్ ప్రసాదు

నకరికల్లు, జనవరి 10 : అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోమ్ రేషన్ పంపిణీని సక్రమంగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాదు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నకరికల్లులోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరును, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహార పంపిణీని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో సంతోషి కుమారి, సూపర్ వైజర్ రమీజూన్, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

నకరికల్లు, జనవరి 10 : క్రీడలతో శారీరక, మానసిక వికాసం పెంపొందుతుందని జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాదు అన్నారు. నకరికల్లులోని వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. క్రీడా ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగుర వేశారు. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, ఎంపీడీవో బీ.శ్రీనివాసరెడ్డి, షేక్ సలీల్, పలువురు ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మృతికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా



పాటిబండ్ల శ్రావణికి ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్న పీడీ జోసఫ్ కుమార్

నకరికల్లు, జనవరి 10 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పాటిబండ్ల శివ మృతి చెందాడు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శివ భార్య శ్రావణికి బుధవారం జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగవరపు జోసెఫ్‌కుమార్ రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియాను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బీ.శ్రీనివాసరెడ్డి, ఏపీడీ వెంకట నారాయణ, ఏపీవో కూనపులి రామకృష్ణ, వైసీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, వంగా రాజారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు మద్దతు తెలపాలి : వైసీపీ ఎంపీటీసీ

ముప్పాళ్ళ జనవరి 10: అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలపాలని వైసీపీకి చెందిన రుద్రవరం ఎంపీటీసీ కళ్ళం వీరభాస్కరరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మారూరి పద్మావతి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో అంగన్‌వాడీలు సమ్మెపై సానుకూలంగా ఉండాలని, తమ పరిధిలోనిది కాకపోయినా మండల పరిషత్ తరుపున ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. రుద్రవరం-బొల్లవరం గ్రామాల మధ్య రోడ్డువేయమని తాను మూడు సంవత్సరాలుగా సర్వసభ్యసమావేశానికి వచ్చిన మంత్రి అంబటి దృష్టికి తెచ్చిన ఫలితంలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, తహసీల్దార్ ఎం.భవానీ శంకర్ పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విధులు నిర్వహించాలని ఆశా, ఏఎన్‌ఎంలపై ఒత్తిడి

ముప్పాళ్ళ జనవరి 10 : మండలంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ విధులు నిర్వహించాలని ఏఎన్‌ఎంలకు, ఆశావర్కర్లకు మండల పరిషత్ కార్యాలయం అధికారులు, ఐసీడీఎస్ అధికారులు తమను బెదిరిస్తున్నారని ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం తాము గర్భిణులకు టీకాలు వేయాల్సి ఉన్నా, తమ శాఖ మీటింగు ఉండి వెళితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మండల పరిషత్ కార్యాలయం అధికారులు, ఐసీడీఎస్ అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయమై ఎంపీడీవో పుట్టారెడ్డిని వివరణ కోరగా తమకు జిల్లా అధికారుల నుంచి మౌఖికంగా ఆదేశాలు వచ్చాయి తప్ప ఎటువంటి అధికారికంగా ఆదేశాలు రాలేదన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న శ్రీనివాసరావు

పెదకూరపాడు, జనవరి 10 : మండలంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన సారెకుక్క వీరాస్వామి భార్య జ్యోతి బుధవారం మృతి చెందింది. వారి కుటుంబాన్ని మండల తెలుగు యువత నేత మేదరమెట్ల సౌమిత్ తండ్రి శ్రీనివాసరావు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం వారి కుటుంబానికి అందించారు. టీడీపీ కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటుందని శ్రీనివాసరావు అన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి...

అచ్చంపేట, జనవరి 10 : మండలంలోని పెదపాలెం ఎస్టీ కాలనీలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించి దంతాల నాగరాజు గృహం పూర్తిగా కాలిపోయింది. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంత కుమారి అగ్ని ప్రమాద బాధితులకు రూ 5 వేలు ఆర్థిక సహాయంతో పాటు 50 కేజీల బియ్యం, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



మున్సిపల్ కార్మికులకు సంఘీబావం తెలియజేస్తున్న కాసా రాంబాబు తదితరులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా

నరసరావుపేట టౌన్, జనవరి 10: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ, జేఏసీ మున్సిపల్ కార్మికులు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, ఏమాత్రం వాళ్ళ సమస్యల వినటానికి కూడా ఇష్టపడటం లేదని అన్నారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఐదుకోట్ల ప్రజలను కాపాడగలిగే మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి షైదన వెంకట్, చక్రం, డేవిడ్, దీనమ్మ, కొండమ్మ, రాజు, యేసు, హనుమంతు, సైదా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వంటావార్పు..



దీక్షాశిబిరం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

వినుకొండ, జనవరి 10: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు న్యాయమైన కోరికలను పరిష్కరించాలంటూ బుధవారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద మున్సిపల్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని వంటావార్పు కార్యక్రమం చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఆశచూపి అధికారంలోకి వచ్చిన తరువాత జగన్‌మోహన్‌రెడ్డి కార్మికులకు మొండి చేయి చూపారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

గుడిపై జగన్‌రెడ్డి ఫెక్సీల ఏర్పాటు దారుణం

● టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జనవరి 10: పవిత్రమైన ఆంజనేయస్వామి గుడిపై దుర్మార్గుడైన జగన్‌రెడ్డి బొమ్మ పెట్టడం దారుణమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్‌రెడ్డి మీ నమ్మకం కాదు. ఆంధ్ర రాష్ట్రానికి పట్టిన దరిద్రం అని, పవిత్రమైన ఆంజనేయస్వామి గుడిపై దుర్మార్గుడైన జగన్‌రెడ్డి బొమ్మ పెట్టడం దేనికి సంకేతమని, వైసీపీ ప్రచారపిచ్చి తారస్థాయికి చేరిందని అరవిందబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు పవిత్రమైన దేవుడి గుడులను సైతం వదలడం లేదని, పద్ధతి మార్చుకోకపోతే ప్రజలు దేహశుద్ధి చేస్తారని అన్నారు. నరసరావుపేట పట్టణంలోని స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ప్రసన్నా ఆంజనేయస్వామి గుడిపై మా నమ్మకం నువ్వే జగన్ అనే ఫెక్సీ ఏర్పాటుపై మండిపడ్డారు. వైసీపీ గూండాలకు జగన్ భగవంతుడు అయితే వారు సంపాదించిన పాపిష్టి సొమ్ముతో గుడికట్టుకొని పూజించుకోవాలి గాని ప్రజలు పూజించే దేవుడి గుడిపై జగన్ బొమ్మలు పెట్టడం రాక్షస రాజకీయాలకు నిదర్శనం అన్నారు. దేవాలయంపై జగన్ బొమ్మను వెంటనే తొలగించాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

108 వంటకాలతో స్వామివారికి నైవేద్యం



స్వామివారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

వినుకొండటౌన్, జనవరి 10: పట్టణంలోని గీతామందిరం ఆధ్వర్యంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని అడ్డగిరి లక్ష్మీదేవి ఆదేశాల మేరకు శ్రీకృష్ణపరమాత్మకు పూజా కార్యక్రమాలు భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భక్తులు 108రకాల వంటకాలను తయారుచేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు లక్ష్మీదేవి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా గీతామందిరంలో ధనుర్మాస పూజా కార్యక్రమాలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గర్రె అనురాధ, ఖజ్జాయం రాణి, తాత కళావతి, కురపటి నాగమల్లేశ్వరి, చీతిరాల భవాని, పొత్తూరి శకుంతల, సనిశెట్టి సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఉన్నతస్థాయికి ఎదగాలి

● ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం, జనవరి 10: క్రీడలలో రాణించే సత్తా ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేక మరుగున పడుతున్న గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడలలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక జడ్పీపాఠశాలలో ఆడుదాం-ఆంధ్ర మండలస్థాయి క్రీడాపోటీలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. పోటీలకు హాజరైన క్రీడాకారులను పరిచయం చేసుకొని అనంతరం కొంతసేపు ఎమ్మెల్యే బ్యాటింగ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. జాతీయస్థాయి పోటీలలో పాల్గొని తృతీయస్థానంలో నిలిచిన పాఠశాల విద్యార్థిని ఆకుమల్ల సమీరాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసినిఅనిల్‌కుమార్, ఈపూరు మార్కెట్‌యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ పోతురాజు, డీఎల్‌డీవో వెంకటరెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, ఎంఈవోలు సాంబశివరావు, లలితాకుమారి, హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీలు రాధాకృష్ణమూర్తి, రాజేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

నూజెండ్ల, జనవరి 10: స్థానిక జడ్పీ పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఐనవోలు, నూజెండ్ల జట్ల మధ్య ఖోఖో, వాలీబాల్, షటిల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీ శ్రీనివాసరావు, ఎంపీడీవో టీ వీరభద్రాచారి, రెండో ఎంఈవో రవిచంద్ర, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ నిడమానూరి వెంకటరత్నం, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



వినుకొండ, జనవరి 10: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పప్పుబజారులోని వివేకానంద స్కూల్ నందు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేసి సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బత్తి రాములు

మండల సర్వసభ్య సమావేశం

బొల్లాపల్లి, జనవరి 10: స్థానిక మండల కేంద్రమైన ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో జిలానీ బాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జగనన్న ఇళ్ళ కాలనీలకు పనులుచేసి నాలుగున్నర సంవత్సరాలైన బిల్లులు రాలేదని ఎంపీడీవో దృష్టికి తీసుకు వచ్చారు. ఆరోగ్యశాఖలో అందిస్తున్న సేవలను వైద్యాధికారులు వివరించారు. గ్రామాల్లో తప్పనిసరిగా పారిశుధ్య పనులు చేయాలని ఎంపీడీవో జిలానీ బాషా సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, ఎంపీడీవో జిలానీ బాషా, సొసైటీ అధ్యక్షుడు డీ గోవిందునాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగంగుంట్ల భూముల రిజిస్ట్రేషన్‌కు ఉత్తర్వులు

- జీవో విడుదల చేసిన నాటి తెలుగుదేశం ప్రభుత్వం
- అమలుకు నాలుగున్నరేళ్ల సుదీర్ఘ సమయం
- హర్షం వ్యక్తం చేసిన లింగంగుంట్ల, అల్లూరిపాలెం గ్రామాల రైతులు
- నాడు కోడెల.. నేడు గోపిరెడ్డి కృషి

నరసరావుపేట, జనవరి 10: ఎన్నో ఏళ్లుగా నెలకొన్న లింగుంట్ల భూముల రిజిస్ట్రేషన్‌కు ఉన్న అడ్డంకులు తొలగిపోనున్నాయి. ఈ మేరకు హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో లింగంగుంట్ల, అల్లూరివారిపాలెం గ్రామాల వారు హర్షం వ్యక్తం చేశారు. పుష్పగిరి పీఠం ఆదీనంలో ఉన్న వందలాది ఎకరాల భూములను ఆయా గ్రామాల వారు సాగు చేసుకుంటున్నారు. అయితే పుష్పగిరి పీఠం భూముల విషయంలో కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌తో భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిచిపోయింది. దీంతో క్రయ విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పక్రియ కోసం గతంలో గ్రామ పెద్దలు ఆమరణ దీక్ష చేశారు. ఈ సందర్భంగా నాటి ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ హక్కు కల్పిస్తామని ఇచ్చిన హామీతో నాడు దీక్షలు విరమించారు. అప్పటి నుంచి భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగలేదు. గామస్థుల విజ్ఞప్తి మేరకు నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు నాడు పుష్పగిరి పీఠాధిపతితో జరిపిన చర్చలు ఫలించి భూములను వినియోగంతో ఉన్న రైతులకు హక్కు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ చేసే విధంగా అగ్రిమెంట్ జరిగింది. ఈ మేరకు కోడెల శివప్రసాదరావు కృషితో తెలుగుదేశం ప్రభుత్వం 2019 ఫిబ్రవరిలో భూమలకు సంబంధించి జీవోను విడుదల చేసింది. ఈ మేరకు భూములు సర్వే కూడా నాడు నిర్వహించి 1904 ఎకరాల భూమి స్వాధీనంలో ఉన్న రైతులను గుర్తించారు. నాడు రిజిస్ట్రేషన్ విలువలో 12 శాతం పుష్పగిరి పీఠంకు చెల్లించే విధంగా ప్రభుత్వం రైతులు, పీఠాధిపతి మధ్య అగ్రిమెంట్ చేసింది. ఈ ప్రక్రియ పూర్తయ్యేలోపు ఎన్నికలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం మారడం సదరు జీవోను అమలు చేసేందుకు కోర్టు అనుమతికి జాప్యం జరిగింది. కోర్టు నుంచి అనుమతి పొంది భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి నాలుగేన్నరేళ్ల సమయం పట్టింది. ఎట్టకేలకు ప్రభుత్వం తరపున కోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు జీవోను అమలు చేయాలని ప్రభుత్వాన్ని అదేశించింది. ఈ ప్రక్రియను ప్రభుత్వం చేత పూర్తి చేయించడంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తనవంతు కృషి చేశారు. రైతులు, పుష్పగిరి పీఠం మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం భూముల వినియోగంలో ఉన్న రైతులు రిజిస్ట్రేషన్ విలువపై 13శాతం చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు చెల్లించిన రైతులకు వారిపై రిజిస్ట్రేషన్ పుష్పగిరి పీఠం చేస్తుందని చెబుతున్నారు. ఎన్నో ఏళ్ల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు కోర్టు ఉత్తర్వులు ఊరటనిచ్చాయి. దీంతో సదరు రైతులు ఆనందోత్సాహలను వ్యక్తం చేస్తున్నారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వం జీవో జారీ చేయగా ప్రస్తుత ప్రభుత్వం కోర్టు ద్వారా జీవో అమలుకు అనుమతి పొందింది. నాడు స్పీకర్ కోడెల శివప్రసాదరావు, నేడు డాక్టర్ గోపిరెడ్డి కృషితో ఆయా గ్రామాల రైతుల భూముల సమస్యలు పరిష్కారం అవ్వటంతో పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

30వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



24 గంటల నిరాహార దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్



నరసరావుపేట: ఆందోళనలో పాల్గొన్న అంగన్‌వాడీలు

నరసరావుపేట టౌన్, జనవరి 10: అంగన్‌వాడీలు పల్నాడు జిల్లా నరసరావుపేట గాంధీ పార్కు వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె బుధవారం 30వ రోజుకు చేరుకుంది. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ, సీఐటీయు, ఐఎఫ్‌టీయు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళనలో అంగన్‌వాడీలు 24గంటల నిరాహార దీక్ష నిర్వహించారు.

నెలరోజులైనా పరిష్కరించలేదు

● యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మెటిల్డాదేవి

అంగన్‌వాడీలు సమ్మెలోకి వచ్చి నెలరోజులైన ఎలాంటి సమస్య పరిష్కరించలేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి అన్నారు. రెండు జీవోలు మాత్రం ఇచ్చి వాళ్ళు ఇచ్చిన 11 డిమాండ్‌లలో 10 పరిష్కారం చేశామని చెబుతున్నారని, ఇది పచ్చి అబద్ధమన్నారు. ఇలాంటి అబద్ధాలు మాట్లాడవద్దని, ఏదీ ఏమైన అంగన్‌వాడీల పోరాటం న్యాయమైనదని అన్నారు. మిని సెంటర్‌లకు సమస్యలు ఉన్నాయని, 400దాటిన జనాభా ఉంటే మెయిన్ సెంటర్‌గా గుర్తించాలన్నారు. నాణ్యమైన ఫీడింగ్ సరఫరా చేయమని అడుగుతున్నామన్నారు. ఏదిఏమైన అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటం ప్రభుత్వానికి వినిపించటం లేదో, కనిపించటం లేదో అర్థంకావటం లేదన్నారు. అంగన్‌వాడీల పట్ల ఎస్మా జీవో తీసుకువచ్చారని, అత్యవసర సేవలకు ఈ జీవో ఇస్తారని, అంగన్‌వాడీ సేవలు అత్యవసర సేవలు ఏలాఅవుతుందని, ఇదికూడా తెలియని ముఖ్యమంత్రి సలహాదారులను పెట్టుకొని పరిపాలన చేస్తున్నాడన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు, ఇళ్ళకు నోటీసులు బలవంతంగా అంటిస్తున్నారని, అంగన్‌వాడీలను దొంగలుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. వెంటనే నోటీసులు వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అంగన్‌వాడీలు సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్మల, మాధవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



చిలకలూరిపేట దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్ వాడీలు

● చిలకలూరిపేట: పట్టణంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం 30వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలు స్థానిక గ్రంథాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో తమపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు, యూనియన్ అధ్యక్షురాలు సావిత్రి, ఉపాధ్యక్షురాలు ఏ పద్మ, ఎం.విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: నరసరావుపేట రోడ్డులోని సురేష్‌మహల్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన కార్యక్రమానికి ఏపీటీఎఫ్ నాయకులు బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయసంఘ నాయకులు మాట్లాడుతూ పోరాడితే పోయేదేమీ లేదని, పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని అంగన్‌వాడీలకు సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినజీయరుస్వామి ఆశ్రమంలో హారతి మహోత్సవం





హారతి మహోత్సవంలో భాగంగా కోలాటాన్ని ప్రదర్శిస్తున్న మహిళా భక్తులు, వేదికపై వేదపండితులతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అహోబిల రామానుజ స్వామి

వినుకొండ, జనవరి 10: వినుకొండ చినజీయరుస్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో ధనుర్మాసోత్సవంలో భాగంగా పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలో కృష్ణుని హారతి కార్యక్రమ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవనాసి మల్లికా ప్రసాద్ ఆధ్వర్యంలో ఒకే వేదికపై 9దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసి పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులచే హారతి కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని త్రిదండి అహోబిల రామానుజ స్వామి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మహిళా భక్తులు, చిన్నారులు ప్రదర్శించిన కోలాట మహోత్సవం పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకుంది.

పింఛన్లు పెంచిన ఘనత వైఎస్ జగన్‌దే

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, జనవరి 10: పార్టీలకు అతీతంగా పింఛన్లను పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో నూతన పింఛన్లు మంజూరైన సందర్భంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారు కష్టపడకూడదని, వారికి చేదోడుగా పింఛన్లను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో రూ.52లక్షల మేర నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పడాల చక్రారెడ్డి, పడాల శివారెడ్డి, గెల్లి చిన కోటిరెడ్డి, వీఆర్‌వో పడాల సుబ్బారెడ్డి, గడ్డం వెంకటరావు, పచ్చవ రవీంద్రబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందజేస్తున్న ఆరోగ్యశ్రీ కార్డులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

దుకాణంపై దాడిచేసిన ఐదుగురి అరెస్టు

వినుకొండటౌన్, జనవరి 10: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలోని ఓ దుకాణంపై కొందరు వ్యక్తులు దాడిచేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే... బ్యాంక్ సమీపంలోని ఓ షాపుపై అమరేశం వంశీ, ఆవుల మహిధరరెడ్డి, కొండమీద మురళీకృష్ణ, ఆవుల మహేంద్రరెడ్డి, ఎం.పవన్‌లు దాడి చేశారని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

నరసరావుపేట లీగల్, జనవరి 10: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు బుధవారం కొనసాగాయి. విధులకు గైర్హాజరై సామాన్య ప్రజానీకానికి చట్టం రద్దు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు, న్యాయవాదులు ఎం.ప్రతాప్‌రెడ్డి, పిచ్చేశ్వరరావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ విధానంపై అవగాహన

శావల్యాపురం, జనవరి 10: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీప్యాడ్‌లపై ఓటింగ్ చేసే విధానంపై బొందిలిపాలెం, మతుకుమల్లి గ్రామాలలోని ఇరుపార్టీల నాయకులకు రెవెన్యూ అధికారులు బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్ఐ నాసరయ్య, ఏఎస్‌వో చెన్నయ్యలు పాల్గొని నాయకుల చేత కొన్ని ఓట్లు వేయించి అవి సక్రమంగా పడుతుంది, లేనిది తనిఖీ చేయించారు. కార్యక్రమంలో వీఆర్వో కరిముల్లా, అరుణ్‌రెడ్డి, మాజీ వీఆర్వో చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఒత్తుల వెంకటేశ్వర్లు, గ్రామనాయకులు చింతా వీరయ్య, అల్లూరి వెంకట్రావు, సుంకర ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో సహకారం అందించండి

● ప్రముఖులకు అరవిందబాబు వినతి



పట్టణ ప్రముఖులతో డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కొల్లి

నరసరావుపేట టౌన్, జనవరి 10: టీడీపీ సీనియర్ నాయకులు, పట్టణ ప్రముఖులతో నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం బేటీ అయ్యారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ తరపున బరిలో ఉంటున్నానని వచ్చే ఎన్నికలలో సహాయ సహకార అందించాలని కోరారు. పట్టణ అభివృద్ధి ప్రణాళికల వివరణ, అవినీతిరహిత నరసరావుపేటే ధ్యేయం అన్నారు. ఆయన వెంట సీనియర్ టీడీపీ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, జనవరి 10: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాలమేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసు అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో గురజాల డీఎస్పీ పల్లపు రాజు, సత్తెనపల్లి ఏపీపీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం టీడీపీతోనే సాధ్యం

రొంపిచర్ల, జనవరి 10: ప్రజా సమస్యల పరిష్కారం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. మండలంలోని సంతగుడిపాడులో బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరవింద బాబు మాట్లాడుతూ వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ప్రైవేట్ ఆస్తులు లూటీ అయ్యాయని తెలిపారు. ఒక్కచాన్స్ అని చెప్పి రాష్ట్రాన్ని అదోగతి పాలుచేశారని తెలిపారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాడిపర్తి సురేష్‌కు గోనుగుంట్ల పరామర్శ

రొంపిచర్ల, జనవరి 10: మండలంలోని ముత్తనపల్లి గ్రామానికి చెందిన రొంపిచర్ల మండల తెలుగు యువత అధ్యక్షులు గాడిపర్తి సురేష్ అనారోగ్యంతో నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కాగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు సురేష్‌ను బుధవారం పరామర్శించారు. కోటేశ్వరరావు వెంట మండలపు వెంకట రత్నం, పొనుగోటి రామారావు, మామిళ్ళపల్లి ఆదిబాబు, దాసు, ప్రసాదు తదితరులు ఉన్నారు.

తప్పుడు కేసులతో టీడీపీని ఏమీ చేయలేరు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 10: తప్పుడు కేసులు, కుట్రలతో తెలుగుదేశం పార్టీని ఏమీ చేయలేరని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం జరిగిన సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ టీడీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడుకేసుల నమోదేపనిగా పెట్టుకున్న జగన్ ప్రభుత్వం ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇప్పటికే స్కిల్ కేసు, అంగళ్ళ ఘటన కేసుల్లో బెయిల్ రాగా తాజాగా మద్యం, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉచిత ఇసుక కేసుల్లో కూడా ముందస్తు బెయిల్ రావటం శుభపరిణామన్నారు. ఈ కేసులన్నింటిలో అంతిమంగా ధర్మమే గెలుస్తుందని, చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటపడతారని ప్రత్తిపాటి పునరుద్ఘాటించారు. జగన్ ఓటమి మన పార్టీ అధికారంలోకి రావటం లాంఛనమేనని, కార్యకర్తలంతా రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సూపర్-6 పథకాల గురించి అన్న క్యాంటీన్‌లు అమలు గురించి, వైసీపీ వైఫల్యాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని, అందుకే ఆ పార్టీ నేతలంతా వైసీపీని వీడిపోతున్నారన్నారు. అంబటి రాయుడు లాంటి వారు తెలియక వెళ్ళినా పది రోజులు కూడా ఇమడ లేక పోయారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముఠా కూలీ దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నరేష్

చిలకలూరిపేట, జనవరి 10: పట్టణంలోని సంజీవ నగర్ ప్రాంతానికి చెందిన మద్దుమాల నరేష్ అలియాస్ పిచ్చయ్య (31) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. బాపట్ల జిల్లా మార్టూరు, చిలకలూరిపేట మధ్య జాతీయ రహదారి పక్కనే కేఆర్ కంపెనీలో ఇతడు ముఠా కూలీగా పని చేస్తుంటాడు. పని ముగించుకొని కంపెనీ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకులో చిల్లర మార్చుకొనేందుకై వెళ్ళాడు. తిరిగి రోడ్డు దాటుతుండగా మార్టూరు వైపు నుంచి వచ్చిన ఒక కారు ఇతడిని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయ పడ్డాడు. 108 వాహన సిబ్బంది అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో లాటరీ నిర్వాహకుడు

నాదెండ్ల, జనవరి 10: మండలంలోని గణపవరం గ్రామ పరిధిలో లాటరీ టిక్కెట్లు అమ్ముతున్న ఒక వ్యక్తిని నాదెండ్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిలకలూరిపేట పట్టణంలోని రాగన్నపాలెంకు చెందిన తోట సత్యనారాయణ జాతీయ రహదారి పక్కన ఉన్న రహీ ఆర్క్ వెల్డింగ్ షాపులో బడ్డీకొట్టు వద్ద లాటరీ టిక్కెట్లను అమ్ముతున్నాడు. బూతాన్ రాసి పేరుతో ఒక్కొక్క టిక్కెట్‌ను రూ.100, రూ.200లకు అమ్ముతున్నాడు. ఈ విషయమై సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బలరామిరెడ్డి అతన్ని అదుపులోకి తీసుకొని రూ.2వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనర్హులకు పింఛన్లు.. అర్హులకు మొండిచేయి

● తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి ఆరోపణ

యడ్లపాడు, జనవరి 10: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామంటూ వైసీపీ ప్రభుత్వ పెద్దలు చేసే ప్రకటనలన్నీ పచ్చి అబద్ధాలని తెలుగురైతు పల్నాడు జిల్లా అధ్యక్షుడు మద్దూరి వీరారెడ్డి విమర్శించారు. పింఛన్‌ల మంజూరులో అవకతవకలు, అర్హులైనవారికి పింఛన్లు రాకపోవడంపై ఎంపీడీవో హనుమారెడ్డిని టీడీపీ మండల నాయకులు బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్లు ప్రతి ఆరు నెలలకు ఒకసారి జూన్, జనవరి నెలల్లో మంజూరు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నవన్నీ కల్లబొల్లి మాటలేనన్నారు. గత ఏడాది జూన్ నుంచి డిసెంబరు మధ్యకాలంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ మంజూరు చేయకుండా వారిలో ముగ్గురు లేదా నలుగురికి మాత్రమే మంజూరు చేశారన్నారు. భర్త చనిపోతే వెంటనే భార్యకు ఇవ్వాల్సి ఉండగా ఆరు నెలలు గడుస్తున్నా వారికి ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. ఎంతమంది పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు, వలంటీర్లు దరఖాస్తులను సరైన సమయంలో ఆన్‌లైన్ చేయించకుండా పక్కన పడవేస్తున్నారని, డబ్బులు ఇచ్చిన వారికి మాత్రం పింఛన్లు మంజూరయ్యేలా చూస్తున్నారని దీనిపై ఏ అధికారి పర్యవేక్షణ చేయకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. అర్హులైన వికలాంగులకు పింఛన్లు మంజూరు కాలేదని, అనర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అర్హులకు పింఛన్లు ఇచ్చేవరకు తెలుగుదేశం పార్టీ తరపున పోరాటం చేస్తామని, నిజాలు నిగ్గు తేలుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, కార్యదర్శి కాకుమాను చంటి, మండల నాయకులు కందిమళ్ల రఘురామారావు, పోపూరి వెంకయ్య, శిలార్, మునాఫ్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

14న పూర్వ విద్యార్థుల సమావేశం

చిలకలూరిపేట, జనవరి 10: పట్టణంలోని ఎస్‌సీవీఎస్ జూనియర్ కళాశాల, బీఆర్ఎన్ ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం స్థానిక ఆర్‌వీఎస్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు టీ అంజిరెడ్డి బుధవారం తెలిపారు. 1974 నుంచి ఇప్పటివరకు కళాశాలల్లో చదివిన విద్యార్థులందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు కిషోర్, హరిదాసుల శ్రీనివాస్, శీలం నాగేశ్వరరావు, శ్రీరామ్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం వజ్రోత్సవాలను విజయవంతంచేయాలి

చిలకలూరిపేట, జనవరి 10: ఈ నెల 12, 13 తేదీల్లో కర్నూలులో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు కే కోటేశ్వరరావు, పోటు శ్రీనివాసరావు బుధవారం పిలుపునిచ్చారు. 75వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. సంఘంలోని ఎందరో త్యాగాలవల్ల ఉపాధ్యాయులకు అనేక సౌలభ్యాలు లభించాయని, ప్యాప్టో ఏర్పాటు, జేఏసీ ఏర్పాట్లలో తమసంఘం ముఖ్య భూమిక పోషించిందని తెలిపారు. చిలకలూరిపేట ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు వీ అక్కయ్య, ఎం.కోటేశ్వరరావు, జమీర్ బాషా, మల్లేశ్వరరావు, మస్తాన్ వలి, కాలేషా తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

సెయింట్ చార్లెస్ స్కూల్‌లో 57వ స్పోర్ట్స్ ఈవెంట్

చిలకలూరిపేట, జనవరి 10: పట్టణంలోని పెదనందిపాడు రోడ్డులో ఉన్న సెయింట్ చార్లెస్ స్కూల్‌లో బుధవారం 57వ స్పోర్ట్స్ ఈవెంట్ జరిగాయి. అర్బన్ ఎస్ ఎల్ లోకేశ్వరరావు ముఖ్య అతిథిగా, ఫాదర్ జే రవి లుకాస్ పాల్గొని మాట్లాడారు. స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ సుందరి, పాఠశాల హెడ్‌మిస్ట్రెస్ సిస్టర్ మేరి విమల, ఆంతోనమ్మ, పీఈటీలు శేఖర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో దుప్పట్లు పంపిణీ

నరసరావుపేట టౌన్, జనవరి 10: నరసరావుపేట పట్టణంలో రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో దాతల సహకారంతో చలి తీవ్రంగా ఉండి దుప్పటి లేకుండా పడుకున్నవారికి బుధవారం దుప్పట్లు కప్పారు. ఈ విధంగా ఎంఐఎంకు చెందిన షేక్ మస్తాన్‌వలి దంపతులు 60మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.